ప్రజాశక్తి

Vol. 6, no. 3

(Jan. 17, 1945)

బెజవాడ, 1945

Record no. 683

Prajāśakti

Vol. 6, no. 3

(Jan. 17, 1945)

Bejavāḍa, 1945

Record no. 683

Regd. No. M. 4486 0-2-0

ప్రజాశక్తి

సంపుటి 6 బుధవారం 17-1-45 సంచిక 3

"మీ వంకరటింకర మార్గాలు నా కర్థంకావు!"

రంగాగారితో గాంధీజీ అన్నమాటలు

[రంగాగారు, గాంధీజీ అభిప్రాయాలంటూ ఈమధ్య పత్రికల్లో చేసిన ప్రకటనలు తమ కోర్కెకు విరుద్ధంగా చేయబడ్డాయని గాంధీజీ ఆక్షేపణ తెలిపినవిషయం గత "ప్రజాశక్తి" సంచికలో బహిరంగ పరచింది. రంగాగారు క్షమార్పణ చెప్పుకున్నట్లుకూడా ప్రచురించాం. ఇప్పుడు శ్రీ ప్యారీలాల్‌గారు, గాంధీజీ అనుమతితో రంగాగారికి - గాంధీజీకి మధ్య జరిగిన సంభాషణల పూర్తిపాఠాన్ని పత్రికల కిచ్చారు. స్థలాభావంచేత, దాన్ని యిచట పూర్తిగా ముద్రించడం సాధ్యమయిందికాదు. అందువల్ల, కాంగ్రెసు - రైతుసంఘాల సంబంధాన్ని గురించిన భాగాన్ని మాత్రమే ముద్రించుతున్నాం. పాఠకులిందుకు క్షమించ ప్రార్థన. సం.]

★

శ్రీయుత ప్యారీలాల్‌గారు యిలా వ్రాస్తున్నారు :—

ప్రొఫెసర్ ఎన్. జి. రంగా జైలునుంచి విడుదల అయాక, సేవాగ్రాంలో గాంధీజీని కలుసుకున్నారు. ఆయనతో రెండుసార్లు సంప్రతింపులు జరిపారు. మొదటిసారి అక్టోబరు 29 వ తేదీని, రెండవసారి నవంబరు 28 వ తేదీని, జరిపారు.

ఈ సంభాషణలు రెండూ పత్రికల్లో ప్రచురించకూడదని యిద్దరూ ఒక అభిప్రాయానికి వచ్చారు. కాని, కొన్ని భాగాలు యిదివరకే పత్రికల్లో ప్రచురించబడ్డంవల్ల, గాంధీజీ ఉత్తరువు ననుసరించి, ఆ రెండు సంభాషణల పూర్తిపాఠాన్ని ప్రచురణకిస్తున్నాను.

★

ప్రొఫెసర్ రంగా:— దేశంలో యిప్పుడున్న రైతుసంఘాలను అవసరమైన సందర్భాల్లో సంస్కరించాలని మీరు సూచించారు. రైతుల్లో పనిచేసే కాంగ్రెసువాదులు రైతుసంఘాల రాజకీయ వైఖరిని తిరిగి నిర్వచించవలసిన అవసరం ఎంతో ఉన్నదని నేనంగీకరిస్తున్నాను. మన జాతీయ స్వాతంత్ర్యాన్ని సాధించేటందుకొక ఐక్యరాజకీయ నాయకత్వం అవసరమనే విషయం గుర్తించవలసిందే. అంతేకాదు. స్వాతంత్ర్యసంపాదనకు కాంగ్రెసు దేశీయులందరికీ - ముఖ్యంగా రైతులకు - అమోఘమైన ఒక ఆయుధమనీ, ఉత్తమమైన నాయకసంస్థ అనీ, నేనంగ్రహిస్తున్నాను. ఈ విధంగా కాంగ్రెసుయొక్క రాజకీయ నాయకత్వాన్ని అంగీకరిస్తూ "కిసాన్ కాంగ్రెసు" లో రైతుల్ని చేర్పించి పనిచేయడంలో హానియేమైనా ఉంటుందా?

గాంధీజీ :—ఈసమస్యను మీరీవిధంగా యెదుట పెట్టడంవల్ల పీచాటిపీచమైన ఆత్మవంచనకు అవకాశముంది. రైతుసంఘాలను సంస్కరించమని నేనన్నానంటే, దాని అర్థం యింతవరకు రైతు సంఘాలు ప్రభుత్వాన్నుంచి అధికారం హస్తగతం చేసుకునే దృష్టితో కాకుండా కాంగ్రెసు సంస్థను స్వాధీనంచేసుకునే దృష్టితోనే పనిచేస్తున్నాయని నా అభిప్రాయం. విద్యార్థి సంఘాల విషయంలోను, కార్మికసంస్థల విషయంలోను, ఇతర సంస్థ లన్నింటి విషయంలోను, కూడ నా అభిప్రాయం యిదే.

రంగా:—మీరన్నది కొంతవరకు నిజమే. ఇదివరలో అలాగే జరిగింది. కాని, అట్టి అభిప్రాయాన్ని మేమిప్పుడు పూర్తిగా వదలుకున్నాం. ఈ విషయమై 1929 లో మీరు చేసిన ప్రకటన తర్వాత, అట్టి వైఖరిని పూర్తిగా విడిచిపెట్టాం. మేమిప్పుడు "కాంగ్రెసు" అనే శబ్దాన్ని రైతుసంఘాలకు చేర్చడంలో ఉద్దేశం, కాంగ్రెసు సంస్థకు పోటీగా పనిచేయడంకాదు; కాంగ్రెసుతో కలిసి పనిచేయడమే మా ఉద్దేశం. "కిసాన్ కాంగ్రెసు" లో చేరే ప్రతివ్యక్తి కాంగ్రెసులో కూడా సభ్యుడుగా ఉండాలని మేం అంటున్నాం.

గాంధీ :—అలా అయితే, మీరు కాంగ్రెసు సంస్థలోనే ఉంటూ దాన్నెందుకు నడపకూడదు? కాంగ్రెసుకు ప్రత్యామ్నాయంగా మరొక సంస్థ ఎందుకు? రైతు సంఘాలు సవ్యంగా పనిచేసినట్లయితే, అవే కాంగ్రెసు అను విషయాన్ని మీరెందుకు గుర్తించరు? ఈరోజున కాంగ్రెసు రిజిస్టరులో ఉన్న సభ్యులు దేశంయొక్క మొత్తం జనాభాలో బహు కొద్దిమంది మాత్రమే. దేశానికంతకూ ప్రాతినిధ్యం వహించడం కాంగ్రెసుయొక్క ధ్యేయం. కాంగ్రెసులో అనేకమంది సభ్యులుగా చేరకపోయినా, ప్రజాసేవద్వారా కాంగ్రెసు భారతీయులందరికీ ప్రాతినిధ్యం వహిస్తుంది. కాంగ్రెసు నేడు నైతికంగా మాత్రమే ఏకైక భారత జాతీయసంస్థ. న్యాయశాస్త్ర ప్రకారం (సంఖ్యలో) కూడా అది ఏకైక జాతీయ సంస్థగా అయిననాడు, కాంగ్రెసు సభ్యుల్లో అత్యధిక సంఖ్యాకులు సహజంగా రైతులేఅయివుంటారు. అప్పుడు రైతులే కాంగ్రెసు పాలసీని నిర్ణయించగల స్థితిలో ఉంటారుగదా!

రంగా:—కాని, కాంగ్రెసు సోదరుల్లో కొందరు, తమ్ము అధికారంలోనుంచి తొలగిస్తామేమోనని మమ్మల్ని అనుమానిస్తున్నారు. అందువల్ల చిక్కులు తటస్థిస్తున్నాయి. వారు మా అస్తిత్వాన్ని అంగీకరించరని మా అనుమానం. మాహక్కుల్ని వారు నిరాకరించవచ్చు. అందువల్ల, కాంగ్రెసుయొక్క రాజకీయ నాయకత్వాన్ని మేం యిష్టపూర్వకంగా అంగీకరిస్తూ, తద్వారా కాంగ్రెసులో కక్షలు పెరగకుండా కాపాడదలచుకున్నాం. ఆర్థికహక్కులకై ఆందోళన చేయడానికి మాత్రం ప్రత్యేక వర్గసంస్థ అవసరముంటుంది. ప్రజాసామాన్యంతో దానికి ప్రత్యక్షసంబంధం ఉంటుంది గనుక, కాంగ్రెసు సంస్థకి-దానికి కూడా బలంచేకూడుతుంది. ఈ విధంగా మేము చేయకపోతే, ఇతరులువచ్చి రైతుల్ని గందరగోళపరుస్తారు.

గాంధీ:—ఇక్కడ మీరొక పొరబాటు చేస్తున్నారు. కాంగ్రెసే పూర్తిగా రైతులకు ప్రాతినిధ్యం వహించేటట్లు మీరు పనిచేయాలి. ఈప్రధాన విషయాన్ని జ్ఞప్తియందుంచుకొని, క్రిందినుంచి పైవరకూ పనిచేయకపోతే, స్వరాజ్యం అనేది ఉండదు. కాంగ్రెసును నిష్కల్మషమైన సంస్థగా చేయడానికి ప్రతి కాంగ్రెసువాది నిశ్చయించుకోవాలి. అనగా కాంగ్రెసునే రైతుల సంస్థగాచేయాలి. ఇక ఆర్థికహక్కుల విషయం ఏమంటే, ప్రజాసేవ చేయుటద్వారా ఆ హక్కులు వాటంతటఅవే వచ్చితీరుతాయి. మరోమార్గం ఏది అవలంబించినా, అది దురాక్రమణే అవుతుంది.

రంగా:—కాంగ్రెసు సంస్థను పునర్నిర్మించడానికి మీరు గత 25 సంవత్సరాలనుంచి అనేక ప్రయత్నాలు చేశారు. వాటి ఫలితం మీకు తెలిసిందే. మీ ప్రయత్నాలు విఫలంకావడానికి నేను కూడా ఒక కారకుణ్ణే. ఇతరులతోబాటు నేను కూడా నా నేరాన్ని ఒప్పుకుంటున్నాను. కాని, ఎన్నిప్రయత్నాలు చేసినా, కాంగ్రెసు రైతుల సంస్థగా మారగలదనే విశ్వాసం మాకు లేదు. అందు కనుగుణ్యమైనరీతిని మేము నడుచుకోగలమను ధీమా నాకులేదు. మీరు చెప్పినప్రకారం చేస్తే, స్వలాభపరులవల్ల మాకు తీరని అపకారం కలుగుతుందని మా భయం. రైతుల్ని వారు దోచుకుతింటారు. తద్వ్యతిరేకంగా మేంచేసే ప్రయత్నాలన్నీ వృధాఅవుతాయి. ఈ రోజున బిర్లావంటివారు మీకుఆశ్రయమిస్తున్నారంటేనూ, మీరందుకు ఒప్పుకుంటున్నారంటేనూ, అర్థం తీవ్రమైన సంస్కరణలేవీ సాధ్యం కాదన్నమాట. కాబట్టి, ఈ విషయంలో మీరు చెప్పినట్లు నేను చెయ్యలేను. [illegible] నేనెంతో విచారిస్తున్నాను. (మిగతా 10 వ [illegible])

★ సంపాదకీయం

గాంధీజీ - రంగా సంభాషణలు

రైతుసంఘాలను గూర్చి గాంధీజీ-రంగాగారికి జరిగిన సంభాషణలను వేరొకచోట ముద్రించాం. దీనివలన తేలే విషయాలేమిటి?

రంగాగారు కొంతకాలం క్రితం అఖిలభారత కిసాన్ కాంగ్రెసును ఏర్పాటుగావించడానికి మహాత్మాజీ ఒప్పుకొని తనకు అధికారమిచ్చినట్లు ప్రకటించారు. అట్టి అధికారమేమీ రంగాగారికి ఇవ్వలేదని ఈ ప్రకటన తెలియజేస్తుంది. కాని రంగాగారు తన కమ్యూనిస్టు వ్యతిరేక ఆవేశంలో, మహాత్మాజీ పేరుతో దేశమంతటా పోటీ రైతుసంఘాలు ఏర్పాటుచేయడానికి పూనుకున్నారు.

మహాత్మాజీ స్వతంత్ర రైతుసంఘా లవసరంలేదని అంటున్నారు. దీనికి కారణం: రైతుసంఘాలు, విద్యార్థి కార్మికసంఘాలు కాంగ్రెసును ఆక్రమించుకోడానికి ఏర్పడ్డాయేగాని, ప్రభుత్వాన్నుండి అధికారం లాగుకోడానికికాదని గాంధీజీకి కలిగిన పొరపాటు అభిప్రాయమే. ఒకప్పుడు రైతుసంఘాల ఆశయం అదేగాని ఇప్పుడు మార్చుకున్నామంటూ రంగాగారు క్షమాపణచెప్పుకున్నారు. 1934-40లలో రైతుసంఘాలు కాంగ్రెసుకు ప్రతిద్వంది సంస్థలుగా పనిచేయాలనిన తన వాదన రంగాగారికి జ్ఞాపకమొచ్చి అలాక్షమాపణ చెప్పుకొని యుండవచ్చు. కాని రంగాగారి ఆ వాదం రైతుఉద్యమానికి, స్వాతంత్ర్య ఉద్యమానికి భంగకరమని రైతుసంఘాలు మొదటినుండీ నిరాకరించాయి. అయినప్పటికీ తన వ్యక్తిగత ఆశయాన్ని రైతుఉద్య[illegible] అంటగట్టడం రంగాగారి సాహసమని చెప్పకతప్పదు.

అయితే స్వతంత్ర ప్రజాసంస్థల అవసరమేమిటి? ప్రత్యేక రైతు, కార్మిక, విద్యార్థిసంఘాలు కాంగ్రెసును ఆక్రమించుకోవాలని ఏర్పడినవి కావు. ఏమీ చైతన్యంలేని ప్రజలను, వారి దైనికకష్టాలను పోగొట్టుకోడంలో కలిపి పనిచేయించడానికి ఈవర్గసంస్థలు మొదటి మెట్టు. తమవర్గ సంస్థలద్వారా అలా పనిచేస్తూ స్వాతంత్ర్యం రానిదే తమ కష్టాలు పూర్తిగ పోవని తమ అనుభవపూర్వకంగా ప్రజలు తెలుసుకుంటారు. స్వాతంత్ర్య సంపాదనకు దేశభక్తుల ఐక్యసంస్థ అయిన కాంగ్రెసులో చేరి పనిచేయడానికి ముందుకు వస్తారు. రైతు, కార్మిక, విద్యార్థి సంఘాలు వెనుకబడిన ప్రజాసామాన్యాన్ని స్వాతంత్ర్యోన్ముఖులనుగావించుతూ, కాంగ్రెసును బలపరచే సంస్థలని మహాత్మాజీ, ఇతర కాంగ్రెసు దేశభక్తులూ గుర్తించాలి. కాంగ్రెసును బలపరిచే స్వాతంత్ర్యసాధనాలైన ఈ ప్రజాసంస్థల ఐక్యతను కాపాడి బలపరచడానికి దేశభక్తులందరూ కలసి పనిచేయాలి.

అంతేగాని, 15 సంవత్సరాలుగ ఆంధ్ర రైతాంగంలో చైతన్యంగలిగిస్తూ స్వాతంత్ర్యోద్యమంలో రైతుల పాల్గొనడానికి తోడ్పడుతూ నేడు దాదాపు రెండు లక్షల సభ్యత్వంతో కూడియున్న ఆంధ్రరాష్ట్ర రైతుఉద్యమాన్ని విచ్ఛిన్నం గావించడానికి రంగాచేసే ప్రయత్నాలకు, పోటీ సంఘ ఏర్పాట్లకు తావివ్వకూడదు.

కిసాన్‌కౌన్సిళ్లలో కాంగ్రెసుకమిటీ ప్రతినిధులు మూడవవంతు ఉండవచ్చునంటాడు రంగా! కాంగ్రెసులోని గ్రామ ప్రతినిధులు కిసాన్ కౌన్సిళ్లుగా ఏర్పడాలట! రైతుల ఆర్థిక సమస్యలపై అధికారం ఈ కిసాన్ కౌన్సిళ్లదట! రైతు రాజకీయములు కాంగ్రెసు కమిటీల ఆధీనమట! దీనిబట్టి రైతుల ఆర్థిక-రాజకీయాలను ఈవిధంగా విడదీసి పంచిపెట్టడంలో రైతు-కాంగ్రెసు సంస్థలు రెండూ పరస్పర పోటీసంస్థలనే తన పూర్వపువాసనను రంగాగారు ఇంకా మానుకోలేదని స్పష్టమవుతుంది. అట్టి రంగాగారిని బలపర్చడానికిగాకపోతే, భారతదేశంలో మరెచ్చటా అవసరంలేని పోటీ రైతుసంఘాలు ఆంధ్రదేశంలో మాత్రం ఎందుకు?

గిడుగు గ్రాంధిక భాషావాదుల పాలిటి పిడుగు

"స్వరాజ్యం కావలె నంటున్నాము. ప్రత్యేకాంధ్ర రాష్ట్రంకోసం చిక్కుపడుతున్నాం. ప్రజాస్వామిక పరిపాలన కోరుతున్నాము. ఇటువంటి పరిస్థితులలో మన ప్రజలకు, సామాన్య జనులకు ఏభాషద్వారా జ్ఞానం కలుగజేయవలసివుంటుందో, ఏభాషలో గ్రంథ రచన సాగించవలసి వుంటుందో, ఆలోచించండి"

16-1-1940 న మద్రాసులో తెలుగు పత్రికా సంపాదకులూ, రచయితలూ కూడిన సభలో మహామహోపాధ్యాయ, కళాప్రపూర్ణ శ్రీ గిడుగు రామమూర్తి పంతులు గారిచ్చిన తుది సందేశంలో తుది వాక్యాలు యివి:

ఇది వారి జీవితమే యిచ్చిన సందేశం. నేటి ఆంధ్రజాతీయ వికాసం ఉదయ సంజ వెలుగులను వెలార్చడానికి ప్రథమ వైతాళికులై పుట్టిన ఆంధ్ర మహాపురుషుల్లో శ్రీ గిడుగు రామమూర్తి పంతులుగారొకరు.

అవి భారత జాతీయోద్యమానికి పునాది పురుషులైన దాదాభాయ్ నౌరోజీ, ఉమేశచంద్ర బెనర్జీ, సురేంద్రనాథ్ బెనర్జీ, బిపిన్‌చంద్రపాలు, వీరేశలింగం పంతులు మొదలైనవారు వర్ధిల్లిన రోజులు. దేశమంతా నూతన నాగరకతా, సంస్కరణోద్యమాలు అనలెత్తి ప్రాకుతున్నాయి. భారతీయ పరిశ్రమల నభివృద్ధి జెందనీయ వలెనని ఆందోళన జరుగుతున్నది. వీటినరికట్టడానికి బ్రిటిషు ప్రభుత్వం చేస్తూన్న ప్రయత్నాల నెదుర్కొనటానికి దేశం సన్నద్ధమౌతున్నది. ఇలాంటి జాతీయ వికాసానికి కేంద్రంగా సంజకాంతుల్లో అరుణోదయంలాగా కాంగ్రెసు మహాసంస్థ పుట్టిన ఉజ్జ్వల యుగమది.

ఈ కాలంలో శ్రీ గిడుగు రామమూర్తి పంతులుగారు 1863 వ సంవత్సరంలో విశాఖపట్టణం జిల్లాలో ముఖలింగానికి రెండుమైళ్ళ దూరాన ఉన్న పర్వతాలపేట అనే గ్రామంలో పుట్టారు.

అప్టి పెద్దదిగాదు. పన్నెండవ యేటనే తండ్రి చనిపోయినారు. కాబట్టి యిబ్బందుల మధ్య తల్లిగారు మెట్రిక్యులేషన్‌వరకు చెప్పించిన చదువు మాత్రమే శ్రీ గిడుగు రామమూర్తిగారు కాలేజీలో చదివిన చదువు. తరువాత 1880 లో పర్లాకిమిడి రాజావారి కాలేజీలో రు. 30 ల జీతంమీద మేష్టరుగా చేరారు. అప్పటినుంచి 1936 వరకు 56 ఏండ్లు పర్లాకిమిడిలోనే నివాస మేర్పరచుకున్నారు. ఉద్యోగంచేస్తూన్న రోజుల్లోనే బి. ఏ. పరీక్ష ప్రయివేటుగా చదివి ప్యాసయినారు.

చరిత్ర అభిమానశాస్త్రం

కాలేజీలో విద్యార్థులకు చరిత్రను బోధించ నియోగింపబడ్డారు. చరిత్రల్లోకెల్ల హిందూదేశ చరిత్రంటేమూ, అందులోనూ ఆంధ్రదేశ చరిత్ర అంటేను వీరికి ఎంతో అభిమానం. వీరి పాఠాలు ఆవేశగంభీరాలై విద్యార్థులను ఉద్రేకపరుస్తూ నడుస్తూండేవి. తమ జన్మస్థానానికి దగ్గరగాను, పర్లాకిమిడికి దక్షిణాన 20 మైళ్ళ దూరంలో ఉన్న ముఖలింగ ఆలయం గోడలమీదనూ ఉన్న శాసనాలనూ, రాగిరేకులపైన చెక్కిన దాన శాసనాలను, కేవలం స్వబుద్ధిపైన ఆధారపడి, కృషిచేసి, చదువగలిగారు. ముఖలింగం 8 వ శతాబ్దం నుండి 12వ శతాబ్దంవరకూ కళింగరాజ్యానికి రాజధానియని, కళింగపట్టణం కళింగరాజ్యానికి రేవు పట్టణమనిన్నీ తెలుసుకుని, 1895 లోనే ప్రకటించారు. ఈయన సేకరించిన ఈదానపట్టాల శాసనాలు "ఎపిగ్రాఫికా యిండికా"లో ప్రకటించబడ్డాయి.

సవరభాషకు రూపమిచ్చిన వాగనుశాసనుడు

పర్లాకిమిడి కొండలచుట్టూ నివసించే సవరలు విద్యావాసన లేకుండా ఉన్నారని చూచి, పంతులుగారి మనసు జాలిబొందింది. వాండ్లకోసం బడులుపెట్టించి, విద్య నేర్పవలెనని కోరికపుట్టి, అందుకొరకు వారి మాతృభాషయైన సవరభాషను 1892 లోనే నేర్వ మొదలు పెట్టారు. అందుకొరకు వారు సవరదేశం తిరుగుతూండగా, మన్యపు మలేరియా తగిలి క్వైనైను తినగా తినగా చెవుడు వచ్చింది. వచ్చిన చెవుడు అంతై అంతై బమ్మచెవుడైంది. ఇన్నికష్టాలొచ్చినా వెనుదీయక సవరభాషను మూల తత్వంతోసహా నేర్చి, వ్యవహారంలోనున్న పదజాలమంతాచేర్చి, సవర-తెలుగు నిఘంటువును, సవర వ్యాకరణాన్నీ సృష్టించి తెలుగుకు నన్నయలాగా, సవరభాషకు వాగనుశాసనుడైనాడు.

సంఘ బహిష్కారం

ఆ కాలంలో మూఢ దురాచారాలలోనున్న జాతి వికాసం పొందనేరదని, శ్రీ కందుకూరి వీరేశలింగంగారు సంఘ సంస్కరణోద్యమాన్ని కోలాహలంగాసాగిస్తున్నారు. గిడుగు రామమూర్తిగారికా గాలి సోకింది. కదలిపోయారు. వితంతు పునర్వివాహాన్ని సమర్థించడానికి శాస్త్రాలన్నీ చదువుకొని మొండి పండితులను ఖండిస్తూ ఉపన్యాసాలిచ్చేవారు. అయితే తన చేతులోనున్న సవరభాషా, దేశ చరిత్రపరిశోధనా కార్యము సరిగా సాగదన్న తలపుతో, సంఘసంస్కార ఉద్యమాన్ని కోపువేసుకుని మోయలేదు. జీవితాంతంవరకు సంఘసంస్కరణ ప్రియులుగా ఉన్నారు. 1908 లో వీరి స్నేహితులైన కీ॥శే॥ కన్నేపల్లి నరసింహం పంతులుగారికి లండనునుండి బారిష్టరయి యింటికి వచ్చినప్పుడు రామమూర్తిగారు ఆయనకు ఆతిథ్యమీయగా ఊరివారు రామమూర్తిగారిని వెలిబెట్టినారు. కాని ఆయన చలించలేదు. అనవసర అధికారానికిగాని, అలా సంచరించే వ్యక్తులకుగాని ఆయన యెన్నడూ లొంగలేదు. వెలి దానంతటదే తొలగిపోయింది.

వ్యావహారికభాషా వాదానికి జయస్తంభము

ఆ కాలంలో యేట్సనే ఇంగ్లీషు దొర స్కూళ్ళ ఇన్స్పెక్టరుగా ఉండేవాడు. ఆయన తెలుగు నేర్చుకునేటప్పుడు పుస్తకాల్లో ఉండే గ్రాంధిక భాషకున్నూ, ప్రజలు వాడుకునే వ్యావహారిక భాషకున్నూ ఉన్న అంతరం తెలుసుకున్నారు. సజీవమై, నిత్యమూ పెరుగుతూండే వాడుకభాషను వదలి గ్రంథాలలోనున్న భాషను పాతవ్యాకరణాలతోకట్టుబడినకృత్రిమమైన తెలుగును నేర్పడంవల్ల బాలుర విజ్ఞాన వికాసం మందగిస్తూందని గ్రహించి, 1910 లోనే వ్యావహారిక భాషావాదాన్ని లేవనెత్తారు. గిడుగు రామమూర్తిగారూ, గురజాడ అప్పారావుగారూ యీ వాదాని కాకర్షింపబడి, ఆ సాధనకు వారు మొదలుపెట్టారు. గురజాడ "కన్యాశుల్కం" "ముత్యాల సరాలూ" మొదలైన కావ్యాలను వాడుకభాషలో ముద్దులొలికేట్లు రచించారు. కాని, ఆంధ్రసాహిత్యపరిషత్తువంటి అభివృద్ధినిరోధకులుఅడ్డునిలిచారు. "దేశంలో అందరను మీకు ప్రతికూలంగా ఉన్నారు గనుక వ్యవహారికభాషా ప్రయోజనము మే మంగీకరించలే" మని ప్రభుత్వమువారు, విశ్వవిద్యాలయము వారు అన్నారు.

గిడుగు అసిధారావ్రతంతో వ్యావహారిక భాష కొరకు యుద్ధం సాగించారు. 'తెలుగు' పత్రికను నడిపారు. "బాలకవి శరణ్యము", "సూర్యరాయాంధ్ర నిఘంటు విమర్శనము", "ఆంధ్ర పండిత భిషక్కుల భాషాభేషజము" యింకా అనేక వ్యాసాలు రచించారు. 1916 లో తణుకులో జరిగిన ఆంధ్రసాహిత్య పరిషత్తులో ఐదుగంటలు యేకధాటిగా ఉపన్యసించి, ఆ సనాతనులచేత వ్యావహారిక భాషను అంగీకరించుతూ తీర్మానింపజేశారు. జయంతి రామయ్యపంతులుగారు కంగారుపడి, తరువాత అలాంటి తీర్మానం పరిషత్తులో ప్యాసుకాకుండా కట్టుదిట్టం చేశారు.

గిడుగు రామమూర్తిగారి పాండిత్య పటిమను గురించి యేట్సుదొర యిలా అన్నాడు: "రామమూర్తిగారితో జరిపిన దీర్ఘసంభాషణల వలన, ఆయనగారు యీవిషయంలో నాకు రాసిన అనేక ఉత్తరాలవల్ల, నాకున్న అభిప్రాయాలు విస్పారినవి. ఆతడు అనేక చీకటి కోణాలలో వెల్తురు ప్రసరింపజేశాడు. తన పరిశోధనల మూలంగా నాకున్న అస్పష్టమైన భావాలకు సౌందర్యవంతమైన పుష్టినిచ్చాడు. ఆయన నాగురువు."

"గురజాడ అప్పారావు మరియొక సాధకుడు. భాషా సంస్కరణలోనే గాక, నాటకములలోని విషయసంస్కరణలో గూడాకృషిచేశాడు. కాని అభివృద్ధి నిరోధకుల నెదుర్కొని నిరంతర యుద్ధము చేయగల నాయకుడు కావాలి. అలాంటి నాయకుడు గిడుగు. గిడుగు గ్రాంధికభాషావాదులపాలిట పిడుగు. రోజురోజుకూ అనేకమంది పండితులనూ, రచయితలనూ, పత్రికలనూ తన వాదానికి తిప్పుకున్నాడు. 1919 లో వీరేశలింగంగారుకూడా దీన్ని అంగీకరించారు. ఆంధ్ర సాహిత్యసంఘం, సాహితీసమితి, నవ్యసాహిత్య పరిషత్తు యేర్పడి వ్యవహార భాషా వాదాన్ని పోషించాయి. గిడుగు రామమూర్తి కృతకృత్యుడైనాడు. వీరి వాదము ముక్తసరిగా తెలుసుకోవాలంటే యీవిధంగా ఉంటుంది: జీవించిఉన్న ప్రతి వస్తువూ మారుతూంటుంది. సజీవమైన భాషలన్నీ మారుతుంటాయి. తెలుగుకూడా సజీవం గాబట్టి, మారుతూంది. నన్నయనాటి భాషే నేటికీ మారలేదంటం అబద్ధం. మారవద్దనుకోడం తెలివితక్కువ.

భాషలో వాడుకదప్పిన శబ్ద రూపాలనూ, మాటలనూ వదలి కొత్తగా వాడుకలోకి వచ్చినవాటిని ఉపయోగిస్తూ గ్రంథాలు వ్రాయడం నిజమైన మంచి సాంప్రదాయం. ఈ సాంప్రదాయా న్ననుసరించే, ఎప్పటికప్పుడు మారుతూన్నమాటల ప్రయోగాన్నిబట్టి లాక్షణికులు వ్యాకరణాలనూ, కావ్య లక్షణాలనూ సరిదిద్దుకుంటూ వచ్చారు. కాని చిన్నయసూరి ఈ సాంప్రదాయానికి తప్పి, సమకాలికమైన నూతన శబ్దజాలాన్ని అపభ్రంశాలని, అసాధువులని తోసివేసి, వ్యాకరణం రాయడం వల్ల ఒకకృత్రిమమైనభాష రచనలోకివచ్చింది. చదువుకున్నవారూ, వారితో సంబంధమున్నవారూ, మాట్లాడుకునే వాడుకభాషతో పొందికలేని గ్రాంధికభాష ప్రజల విజ్ఞానాభివృద్ధికి సంకెళ్ళయిపోయింది. ఈసంకెళ్ళను బద్దలుకొట్టి, మనభాషకు పారంపర్యంగా సహజమైన శిష్టవ్యావహారికంలో రచన సాగించాలి.

పరిశ్రమలు దేశంలో వ్యాపించడానికి భారతదేశంలో నడిచే జాతీయోద్యమపు వెల్లువ ఆంధ్రదేశాన్ని ముంచెత్తిన బెంగాలు విభజన వ్యతిరేకోద్యమపు రోజుల్లో, మన ఆంధ్రరాష్ట్రోద్యమంకూడా ప్రారంభించింది. ఆ రోజుల్లోనే మనకూ చిన్నచిన్న పరిశ్రమలు స్థాపనకావడం జరిగింది. సరిగా ఆరోజులకే గిడుగువారి వాడుకభాషావాదం బయలుదేరింది. జాతీయోద్యమంతోపాటు, ఆంధ్ర రాష్ట్రోద్యమంతోపాటు వాడుకభాషా ఉద్యమం గూడా పెరిగి స్థాయి నేర్పరచుకొన్నది. దేశంలో అందరూ వాడుకభాషను ఆమోదిస్తున్నారు. యిక ప్రభుత్వమూ, ఆంధ్ర విశ్వవిద్యాలయమూ మాత్రమే ఆమోదించాలి. ఆంధ్ర విశ్వవిద్యాలయము శ్రీ రామమూర్తిగారి భాషాకృషిని "కళాప్రపూర్ణ" బిరుదంతో బహూకరించింది. కాని ఆయన భాషావాదాన్నింకా ఆమోదించలేదు.

చివరకు రామమూర్తిగారు 78 వ యేట 15—1—40 న పత్రికా సంపాదకులకూ, విలేఖరులకూ తుది విజ్ఞప్తిచేశారు. "మీ చేతులలో పత్రికలున్నవి. మీరెంతైనా చేయగలరు." ఇది ప్రభుత్వంచేత, విశ్వవిద్యాలయంచేత, వాడుకభాషను ఆమోదింపజేయమని ఆంధ్రదేశానికి యిచ్చిన తుదిసందేశం. ఈ సందేశాన్ని మనం అందుకుని సాధించాలి. పాఠ్య పుస్తకాలలో వాడుకభాష పనికివస్తుందా? అన్న అనుమానంతో ఊగిసలాడిన నవ్యసాహిత్య పరిషదధ్యక్షులైన శ్రీ కాటూరి వారిలాంటి వారంతా పంతులుగారి యీజీవిత సందేశాన్ని స్మరించుకుని, మనస్సులను సదిలపరచుకోవాలి.

ప్రజా సామాన్యానికి విజ్ఞానమీయటానికి వెలిగించిన జ్యోతి గిడుగు రామమూర్తి. ఆయన చనిపోయి 4 యేండ్లు గడిచింది. ఆజ్యోతి వెలుగులతో ప్రకాశవంతమైన ఆంధ్రహృదయం మహాజ్యోతియై విజ్ఞానపథంలో పరుగులిడి ప్రకాశిస్తూంది.

— పి. వి. శివయ్య

గిడుగు రామమూర్తి వర్ధంతి
22—1—45
ఆంధ్రదేశమంతటా జరపండి!

"తాసిల్‌దార్"

(8 వ పేజీ తరువాయి) నీచత్వాన్ని చూపుతోంది. స్త్రీకి "నీ స్థానం వంటయిల్లు; కను; తిను; కాళ్లొత్తు" అనే పాపిష్టుసందేశాన్నిస్తోంది. ఒకమాటలో చెప్పాలంటే, యీపిక్చర్ ఆంధ్రప్రజల సభ్యతకే విరుద్ధమైనది. ప్రజలే అధికారంలో ఉంటే, యిలాంటి పనికిమాలిన పిక్చర్ తీయనీయరు.

— యం. బసవపున్నయ్య

హిందూమహాసభ నినాదాలకు కాశేశ్వరరావుగారి తాళం

"కాంగ్రెసు స్వయంనిర్ణయ సూత్రాన్ని అంగీకరించడం లేదు. స్వయం నిర్ణయ మాత్రంలో నాకునమ్మకమూలేదు. ఇండియాకు అది వర్తించగూడదని చెప్తాను"

"బలమైన కేంద్ర ప్రభుత్వానికి అంగీకరించనిదే, కాంగ్రెసు నాయకత్వం ముస్లింలతో సమాధాన పడదు."

"ముస్లింలీగుతో రాజీపడాలనే సిద్ధాంతం మాకు లేదు. మాతో సమాధానపడడానికి ముందుకువచ్చే మహమ్మదీయు లెవరితోనైనా సరే మేము రాజీపడడానికి సిద్ధమే"

ఈ మాటలన్నది ఎవరోకాదు. ఈమధ్యనే బెజవాడలో రాధాకుముద్ ముఖర్జీ గారికి జరిగిన తేనీటివిందు సందర్భంలో సుప్రసిద్ధ కాంగ్రెసువాది అయ్యదేవర కాశేశ్వరరావుగారు చేసిన ఉద్బోధ ఇదంతా! ఆశ్చర్యపడకండి. పరిస్థితులుఎలాపరిణమిస్తున్నాయో, గాలిఎటువైపు వీస్తున్నదో, తెలుసుకోవాలంటే కథ ఇంకా వుంది.

హిందూమహాసభ, ఆర్. యస్. యస్. మొదలైన జాతీయ వ్యతిరేక మత దురభిమానాలను రెచ్చగొట్టే సంస్థలన్నింటికీ దోహదమివ్వడానికి హుషారుగా ముందుకు వచ్చే చుండూరు రెడ్డిగారు అందరికీ పరిచయులే. వారినాయకులైన సావర్కార్ యిచ్చిన ఆజ్ఞానుసారం కస్తూరిబా నిధికి ఒక దమ్మిడీ కూడా ఇవ్వ నిరాకరించారు. వీరు ఈ మధ్యనే 'అఖండహిందూస్తాన్' ప్రచారం కొనసాగించడానికి వచ్చిన రాధాకుముద్ ముఖర్జీగారికి బెజవాడలో తేనీటివిందుఇచ్చారు. ఆసందర్భంలో జరిగిన మీటింగుకు శ్రీయుత అయ్యదేవర కాశేశ్వరరావుగారు అధ్యక్షత వహించారు.

రాధాకుముద ముఖర్జీ ఎవరు?

ఈ ముఖర్జీని గురించి కొంచెం చెప్పవలసిన అవసరంఉంది. ఆంధ్రలోకానికి ఈయన క్రొత్తవ్యక్తి. బెజవాడలో జరిగిన ఆయుర్వేద మహాసభకు వచ్చి, అఖండ హిందూస్తాన్ ప్రచారం ప్రారంభించాడు. అక్కడేలెండి అయ్యదేవరవారికీ, ఆయనకూ, పరిచయం గల్గింది. లక్నో యూనివర్సిటీలో ఈయన ఒక ప్రొఫెసర్. సంస్కృత పాండిత్యంకూడా ఉంది. అనేక గ్రంధాలు వ్రాశారు. కాని ఈయన భావాలో?

4 సంవత్సరాలక్రితం బెంగాలులో జమీందారీ విధానాన్ని గురించి విచారణ జరపడానికి ఫ్లౌడ్ కమిటీని ప్రభుత్వం నియమించింది. బెంగాలు రైతులను పీల్చి పిప్పి చేస్తున్న జమీందారీ విధానం రద్దుకావాలని ప్రతివారూ కోరుతారు. కాని రద్దుకాగూడదని ముఖర్జీగారు కమిటీ యెదుట సాక్ష్యమిచ్చి ప్రసిద్ధికెక్కారు. ఇది 4 సంవత్సరాల క్రిందటి విషయం.

ఈమధ్యనే, 2 నెల్లక్రిందట ఢిల్లీ లో 'అఖండ హిందూస్తాన్' సభ జరిగింది. ప్రభుత్వ దోహకుమువాలాలైన డాక్టర్ ఖరే, జోగేంద్రసింగు, ఈమధ్యనే బర్మాకు కమీషనర్‌గా నియమించబడ్డ జెమ్నాదాస్ మెహతా, హిందూమహాసభ నాయకులు సావర్కార్, డాక్టర్ మూంజీ, గోకుల్‌చంద్ నారంగ్ మొదలైన ప్రభుత్వభంట్లు, జాతీయవ్యతిరేకులు, మతద్వేషాలను రెచ్చగొట్టేవారు - అందరూ సభకు హాజరై 'అఖండ హిందూస్తాన్' ఉపన్యాసాలు చేశారు. ముస్లింజాతులస్వయం నిర్ణయహక్కును వ్యతిరేకిస్తూ తీర్మానం ఆమోదించారు. గాంధీ-జిన్నా సంప్రతింపులు పనికిరావని ప్రకటించారు. ఆసభకు అధ్యక్షత వహించాడు రాధాకుముద్ ముఖర్జీ. అలాంటి ముఖర్జీగా రుపన్యసించిన సభకు అధ్యక్షత వహించారు కాశేశ్వరరావుగారు!

ఆంధ్రరాష్ట్రానికి ఆర్థిక స్వయంపోషకత్వం లేదని, ఆర్థిక స్వయంపోషకత్వం ప్రత్యేక రాష్ట్ర నిర్మాణానికి అవసరమని ముఖర్జీగారు ఆంధ్రరాష్ట్ర ఆశయానికి వ్యతిరేకంగా ఉపన్యాసం ప్రారంభించాడు. లెక్కలతో కూడిన హేతువాదాన్ని ఆధారంచేసుకొని మాట్లాడుతానని ప్రగల్భాలుకొట్టిన ముఖర్జీగారు ఆంధ్రరాష్ట్రాన్ని గురించి చెప్పినప్పుడు లెక్కలు అధ్యక్షత పదవిలోఉన్న కాశేశ్వరరావుగారికిగూడ ఆశ్చర్యం కల్గించినయి!

తరువాత, హిందూ - ముస్లిం సమస్యను గురించి ముఖర్జీ ఉపన్యాసం నడిచింది. స్వయంనిర్ణయసూత్రాన్ని గురించి మాట్లాడేవారిని ఆయన వెక్కిరించాడు. అటువంటి ప్రమాదకరమైన సూత్రాలను వర్తింపచేస్తే, బ్రిటిష్‌ప్రభుత్వంధర్మానఇండియాలో ఏర్పడిన ఐక్యత (?) భగ్నం కాగలదని వాపోయాడు. సోవియట్ ఉదాహరణను అతి గంభీరంగా చెప్పాడు. 151 భాషలు మాట్లాడే 180జాతులు అక్కడ ఐక్యమయినవంటే, కారణం, ఆదేశములో ఏర్పడిన బలమైన కేంద్రప్రభుత్వమే నన్నాడు. స్వయంనిర్ణయ హక్కును గుర్తించుటద్వారా సోవియట్ యూనియన్ సోదర జాతుల సమాఖ్యగా ఎలా అభివృద్ధి అయిందీతెలియజేసేచరిత్రనుమరుగుపరిచాడు సోవియట్ కేంద్రప్రభుత్వం వంటి బలమైన కేంద్రం 'అఖండ భారత్'లోకూడా (హిందూస్తాన్ అనేపదం పరాయి సాంప్రదాయంకలది గనుక భారత్ అని మార్చాడు.) ఏర్పడాలని, అటువంటి కేంద్రం కొరకు అందరూ కృషి చేయాలనన్నాడు!

అంత్యోపన్యాసంలో కాశేశ్వరరావుగారు ముఖర్జీగారి 'అఖండ భారత్' వాదానికి, తమకూ (కాంగ్రెసువారికి) దాదాపు భేదం లేదన్నాడు. స్వయంనిర్ణయ సూత్రాన్ని ముఖర్జీతోపాటు తాముగూడ తృణీకరించారు. కాంగ్రెసు దాన్ని అంగీకరించలేదన్నారు. బలమైన కేంద్రప్రభుత్వం లేనిదే, కాంగ్రెసు నాయకత్వం ముస్లిములతో రాజీపడదని వ్యాఖ్యానం చేశారు.

కాంగ్రెసు దృక్పథాన్ని, గాంధీజీ సూచనలను, బలపరుస్తూ కాంగ్రెసు సాంప్రదాయాలను వ్యతిరేకించేవారిని ఖండించవలసిన కాశేశ్వరరావుగారు జాతీయదక్యతను, కాంగ్రెసు-లీగు ఐక్యతను వ్యతిరేకించే హిందూమహాసభ నాయకులతో చేరడం, ఆశ్చర్యంగా ఉంది.

స్వయంనిర్ణయ సూత్రాన్ని కాంగ్రెసు అంగీకరించడంలేదా? 1942 ఢిల్లీ తీర్మానం, 1942 ఆగస్టు తీర్మానం, 1943 లో గాంధీజీ రాజాజీ సూచనలను ఆమోదించడం, 1944 లో గాంధీజీ జిన్నాకుచేసిన సూచనలు-వీటినిపరిశీలిస్తే క్రమేణా స్వయంనిర్ణయ సూత్ర సాంప్రదాయం కాంగ్రెసులో ఎలా బలపడిందీ తెలుస్తుంది. "రెండుజాతుల సిద్ధాంతాన్ని వదిలేసి, స్వయంనిర్ణయసూత్రాన్ని అనుసరించి మనమీ సమస్యను ఎందుకు పరిష్కరించగూడదు?" అని గాంధీజీ జిన్నా గారితో చెప్పినమాట కాశేశ్వరరావుగారు మరిచిపోయినట్లున్నారు. "విడిపోతే సోదరులుగా విడిపోదాం. సంపూర్ణ స్వాతంత్ర్యంగల రాజ్యాంగముగా విడిపోయే ముందు ప్రజాభిప్రాయం తీసుకోవాలి. విడిపోవాలని ప్రజాభిప్రాయం తెలియజేస్తే, అలాగే విడిపోవచ్చును." అని గాంధీగారు జిన్నాకు చేసిన సూచన యింకా ఉపసంహరింపబడలేదని కాశేశ్వరరావుగారు గుర్తించాలి. గాంధీజీదేశాభ్యుదయంకొరకువిడిపోయే హక్కును కూడా అంగీకరించి "ఉమ్మడి విషయాలపై ఒడంబడికలు జరగా లన్నాదేగాని, బలమైన కేంద్రప్రభుత్వం, ఉండాలని కోరలేదు. ముస్లిం లీగు అధిక సంఖ్యాకులైన ముస్లింప్రజల సంస్థ అనిగూడ గాంధీజీ అంగీకరించారు.

★

గాంధీజీ నాయకత్వంలో విశ్వాసముందని మాటిమాటికిప్రకటనలు చేస్తూ, గాంధీజీసూచనలకు, కాంగ్రెసుసాంప్రదయానికి వ్యతిరేకంగా ఇష్టంవచ్చిన వ్యాఖ్యానాలను చేస్తూ, ముఖర్జీ వంటి అభివృద్ధినిరోధకులతో కాశేశ్వరరావుగారు కలిసిపోతున్నారంటే, పరిస్థితులు ఎలా పరిణమిస్తున్నవో, దేశభక్తులందరూ గుర్తించాలి. కాంగ్రెసు నాయకులు అనుసరించే ప్రమాదకరమైన పోకడలను అరికట్టుటకు దేశభక్తులందరూ పూనుకుని, పవిత్ర కాంగ్రెసు సాంప్రదాయాలను రక్షించాలి.

— కంభంపాటి సత్యనారాయణ (జూనియర్)

ఆంధ్ర జాతీయగీతం కావాలి

ఉత్తమ గీతానికి రు. 116 లు. బహుమానము

తెలుగు కవి సోదరులారా!

విశాలమైన ఆంధ్రభూమిలో దాదాపు 3 కోట్లమంది తెలుగు ప్రజలమున్నాము. రెండువేలేండ్లకు మించిన ప్రాచీన సంస్కృతి మనది. "దేశభాషలందు తెనుగు లెస్స" అనిపించుకొన్నది మన మాతృభాష. ఏజాతిఅయినా సగర్వంగా చెప్పుకోతగ్గ ఉజ్వలమైన చరిత్ర మన ప్రజలది. గోదావరి, కృష్ణ, పెన్న, తుంగభద్ర నదులు ప్రవహించే పవిత్రభూమి మనది.

అట్టి మన తెనుగుజాతి నేడు వెలవెలబోతూంది. మనకు ప్రత్యేకరాష్ట్రమైనా లేదు. ఆంధ్రభూమి మద్రాసురాష్ట్రంలో కొంత, హైదరాబాద్ సంస్థానంలోకొంత, మధ్యరాష్ట్రం, మైసూరు సంస్థానాలలో మరికొంత – యీవిధంగా చీలిపోయివుంది. వివిధప్రాంతాలలోని తెలుగు ప్రజలందరికి మనమంతా ఒకే ఆంధ్రజాతి వారమనే చైతన్యం, ఉత్సాహం కలిగించే తెలుగు జాతీయగీతం మనకులేదు.

స్వతంత్ర భారతదేశంలో దోపిడి, దారిద్ర్యంలేకుండా ప్రజలందరికి సమానావకాశాలు యిచ్చే ప్రజారాజ్యాన్నిఆంధ్రులం స్థాపించుకోవాలి. అప్పుడు మన తెలుగుగడ్డకు, ఆంధ్రజాతికి ఉజ్వలమైన భవిష్యత్తు వుంటుంది. మన దేశంలో ప్రవహించే నదీజలానికి తగిన ప్రాజెక్టులు నిర్మించితే, తెలుగుదేశమంతా సస్యశ్యామలమై ధనధాన్యాలతో అలరారుతుంది. ఆంధ్ర భూగర్భంలోవున్న లోహాదులను తవ్వి పరిశ్రమలు నిర్మించితే తెలుగుప్రజ ధన కనక వస్తువాహనాలతో తులతూగగలదు.

పై భావాలను సూచించుచూ, చక్కని ఆంధ్ర జాతీయగీతం రచించాలని తెలుగు కవులను కోరుతున్నాను. గీతం పాడటానికి సులభంగా వుండాలి. తెలుగు నుడికారం ప్రతిబింబించుచూ వుండాలి. గీతం 30 పంక్తులకు మించి ఉండకూడదు. ఉత్తమమైన గీతానికి రు. 116 లు. బహుమానం యివ్వబడుతుంది.

ఏది ఉత్తమగీతమో నిర్ణయించడానికి యీక్రిందివారు ఒక కమిటీగావుంటారు. 1. శ్రీ తెలికిచర్ల వెంకటరత్నంగారు 2. శ్రీ పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగారు 3. శ్రీ అడివి బాపిరాజుగారు 4. శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు 5. శ్రీ కంభంపాటి సత్యనారాయణగారు 6. శ్రీ తుమ్మల వెంకట్రామయ్యగారు 7. శ్రీ మద్దుకూరి చంద్రశేఖరరావుగారు.

షరా: కవులు తాము రచించిన గీతాలను ఫిబ్రవరి నెలాఖరుకు చేరేలాగు క్రింది అడ్రెసుకు పంప ప్రార్థన:—

అడ్రెసు:—
పుచ్చలపల్లి సుందరయ్య
ప్రజాశక్తి ఆఫీసు, బెజవాడ.

ఇట్లు విన్నవించు,
పుచ్చలపల్లి సుందరయ్య
4—1—1945.

స్వాతంత్ర్య సమరంలో పరస్పరద్వేషాలు అడ్డురాగూడదు

8 వ అఖిల భారత విద్యార్థి మహాసభ

మా విలేఖరి

"మీలో గొప్ప శక్తి వుంది. జాతీయోద్యమంమీనుంచి వుత్సాహాన్ని పొందుతోంది. మీరంతా గాంధీజీ కెంతో శక్తివి. ఉత్సాహాన్ని యిచ్చే సైనికులు. మీరెన్నో త్యాగాలు చేశారు. మేమంతా కారాగారంలో వున్నప్పుడు, బెంగాలంతా కరువులో మునిగి వున్నప్పుడు, మీరు ప్రజలకెంతో సేవచేశారు. దీన్ని ఎవరూ కాదనలేరు.

"కాంగ్రెసు-లీగు ఐక్యత కావాలి. విద్యార్థులంతా ఐక్యమవ్వాలని నినాదాలిచ్చినంత మాత్రాన ఐక్యత రాదు. యుద్ధంలో విజయం కేవలం కమాండర్లవల్ల రాదు. వారి వెనుకనున్న మామూలు సైనికులే విజయానికి కారకులు. అలాగే, కేవలం మన నాయకులే ఐక్యత తీసుకురాలేరు. వారి వెనుకనున్న ప్రజాసామాన్యం, విద్యార్థులు వారివారి నిత్యజీవితంలో రాజకీయ, ఆర్థిక, సాంఘిక విషయాలలో, ఒకరి నొకరు అర్థం చేసుకోవడం ద్వారా, ఒకరితో మరొకరు సంబంధం ఏర్పరచుకోవడం ద్వారా, ఒకరి సంస్కృతిని మరొకరు ప్రేమించడం ద్వారా - ఐక్యత సాధించ గల్గుతాం.

"కాని మీలోమీకు భేదాలున్నాయి. వాటిని మరచిపోవాలి. ఈ మహత్తర స్వాతంత్ర్య పోరాటంలో వ్యక్తిగత ద్వేషాలు అడ్డురాగూడదు. మనమంతా భుజం, భుజం కలిపి పనిచేయవలసిన రోజులివి. కాబట్టి అంతా ఐక్యమవ్వండి. జాతీయోద్యమంలో మీపాత్రను నిర్వహించండి." అని శ్రీమతి సరోజినీ నాయుడుగారు డిశంబరు 28, 29, 30 తేదీలలో కలకత్తాలో జరిగిన 8 వ అఖిలభారత విద్యార్థి మహాసభలో ఉపన్యసించారు.

960 మంది విద్యార్థులు మహాసభకు ప్రతినిధులుగావచ్చారు. ఆంధ్రులు 75 మంది. బీహారు విద్యార్థి ఫెడరేషన్‌పై నిషేధమున్నా, 80 మంది అచటనుంచి రావడం, సింహళంనుంచి, హిమాలయానుంచి (గూర్ఖా విద్యార్థులు), శాంతినికేతనంనుంచి, హైదరాబాదు స్టేటునుంచి, సౌహార్ద్ర ప్రతినిధులు రావడం ఈ సభయొక్క ప్రత్యేకత. ఒక్కమాటలో చెప్పాలంటే, సింహళం మొదలుకొని హిమాలయ పర్వతాల వరకు అన్నిరాష్ట్రాలనుంచి విద్యార్థులు ప్రాతినిధ్యం వహించారు. ఇంతవరకు ఏమహాసభకు యింతమంది విద్యార్థులు హాజరవలేదు.

"కస్తూరిబా నగరం" లో

28 వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు బెంగాలు విద్యార్థి వాలంటీర్లు, విద్యార్థినీదళముతో కస్తూరిబా నగరం (పెండాలు) చేరారు. పెండాలు ముఖద్వారానికి "ఠాగూరు గేటు" అని పేరుపెట్టారు. అప్పటికే పెండాలంతా ప్రతినిధులతోను, ప్రేక్షకులతోను నిండి వుంది. గాంధీ, జిన్నా, జవహర్‌లాలు మొదలగు దేశనాయకుల బొమ్మలు వేదికచుట్టూ అలంకరించబడ్డాయి. సాధనగుప్తా (ఆహ్వాన సంఘాధ్యక్షుడు), శ్రీ ధూర్జటి ప్రసాదముఖర్జీ గారిని (లక్నోయూనివర్సిటీ ప్రొఫెసర్) అధ్యక్ష స్థానాన్ని అలంకరించమని ఆహ్వానసంఘం తరపున కోరారు. విద్యార్థి వాలంటీరుదళం సెల్యూటు చేస్తూండగా ప్రశాంతసన్యాల్ జండాను ఎగురవేశారు.

జాతీయోద్యమంలో మరణించిన విద్యార్థి వీరులకు జోహారులర్పించిన తర్వాత, "జనగణమన అధినాయకజయహే" అనే ఠాగూరు గేయంతో సభప్రారంభమైంది. సభను ప్రారంభిస్తూ బి.సి. రాయిగారు (కలకత్తా మాజీ విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు) యీ విధంగా చెప్పారు: "దారిద్ర్యం, రోగాలు, అజ్ఞానము సోమరితనం, ఇవి మానవజీవితాన్ని నేడు ఎదుర్కొంటూన్న ప్రధాన సమస్యలనే విషయం యోచనా శక్తిగలవారంతా అంగీకరించినదే. ఏసమస్యనైనా మీరు చర్చించేటప్పుడు, యువకులైన మీ ప్రధాన కర్తవ్యం ప్రజలకు సేవచేయడమనేది మరచిపోకండి. మానవ జీవితాన్ని మంచి స్థితికి తీసుకురావాలంటే ముఖ్యంగా మూడు విషయాలు అవసరం. ఒకటి జ్ఞానం, రెండు ప్లాను, మూడు కార్యసాధనం. నాకు పరిచయమున్నంత వరకు మీ సంఘాలు కరువునివారణకై అమూల్యమైన సేవచేశాయి. మిమ్ములను నేను కోరేదొక్కటే. దేశ సౌభాగ్యానికి ఒక నిర్మాణయుక్తమైన కార్యక్రమాన్ని యీ సభలో తీసుకొని, ఉత్సాహంతో కార్యసాధనకు పూనుకుంటారని ఆశిస్తున్నాను."

తర్వాత ఆహ్వాన సంఘాధ్యక్షుడు రిపోర్టు యిస్తూ, 900 మంది ఆహ్వాన సంఘంలో చేరారనీ, అందులో 81 మంది ప్రొఫెసర్లు, డాక్టర్లు, లాయర్లు వున్నారనీ, రు. 8000 లు వసూలు చేశామనీ, యిందుకు ప్రత్యేకంగా విద్యావంతులు సహాయపడ్డారనీ చెప్పుతూ, దేశాన్నెదుర్కొంటూన్న సమస్యలపై తర్జనభర్జనలు జరిపి, ఒక నిర్దిష్టకార్యక్రమాన్ని తీసుకొంటారని ఆశిస్తూ తమ ఉపన్యాసాన్ని ముగించారు.

200 సందేశాలు

బెంగాల్‌నుంచి 50 మంది ప్రిన్సిపాల్సు, ప్రొఫెసర్లు, లాయర్లు, డాక్టర్లు కాంగ్రెసు యం. యల్. ఏ. లు. మహాసభను జయప్రదం కావాలని ఆశీర్వదిస్తూ సందేశాలు పంపారు. వారిలో జె. సి. గుప్తా, బి. కె. బాసు, జ్యోతిబాసు, హిరేన్ ముఖర్జీ మొదలైన వారున్నారు. ఈ దిగువ వారి దగ్గరనుంచి కూడా సందేశాలు వచ్చాయి. కె. టి. హుంకార్ (కార్యదర్శి, ప్రపంచ యువజనోద్యమం) గ్రేట్‌బ్రిటన్‌లో నున్న యంగ్‌ఆస్ట్రియాసంస్థ, జెకోస్లోవేకియా విద్యార్థి సంఘం, జాతీయ విద్యార్థిసంఘం గ్రేట్‌బ్రిటన్, పశ్చిమ ఆఫ్రికా విద్యార్థిసంఘం, లేబరు విద్యార్థి సంఘం కాంగ్రెసు నాయకులైన గోపీనాథ బార్డొలాయి, శ్రీప్రకాశ, గోపీనాథ్ శ్రీవాస్తవ, అనుగ్రహ నారాయణ సిన్హా, స్వామీరామానందజీ, సంపూర్ణానంద్ గారలనుంచి, వీరుగాక 30 మంది కాంగ్రెసువాదుల దగ్గరనుంచి, సందేశాలు వచ్చాయి. మొత్తం 200 సందేశాలొచ్చాయి. అంతా కోరింది ఒక్కటే: విద్యార్థులలో ఐక్యత నిర్మించమని, కరువునుండి ప్రజలను కాపాడమని, ఐక్యతతో జాతీయప్రభుత్వాన్ని సాధించి, ఫాసిజాన్ని నాశనం చేయమని. "మీలోవున్న విభేదాలను మరచిపొండి; దేశాన్ని కాపాడండి." ఇది చౌదరీ లాల్‌మియా (బెంగాలు ముస్లింలీగు లీగు కమిటీ కార్యదర్శి) మహాసభలో యిచ్చిన సందేశం. "అన్ని పక్షాలను ఐక్యపర్చండి" జె. సి. గుప్తాగారు మహాసభలో యిచ్చిన సందేశమిది. తరువాత అధ్యక్షులు తమ అధ్యక్షోపన్యాసాన్ని ప్రారంభిస్తూ, "విద్యార్థులు రాజకీయాల్లోనే నిమగ్నులు కాకుండా, తమ విద్యార్థిసమస్యలు చర్చించి, విద్యావిధానం నశించకుండా కాపాడుకోవాలి. దేశంలో వైజ్ఞానిక, సంస్కృతిక సాంప్రదాయాలు విచ్ఛిన్నమైపోతున్నాయి. విద్యార్థి లోకమంతా ఐక్యమైతేనేతప్ప మన ప్రాచీన ఔన్నత్యాన్ని రక్షించుకోలేం. రాజకీయరంగంలోను, విద్యార్థి జీవితంలోను మిమ్ములనెదుర్కొనే సమస్యలను పరిష్కరించుకునేనిమిత్తం, యావన్మంది విద్యార్థులకు అంగీకారమయ్యే సూచనలనే తీసుకుని, అందరు విద్యార్థులనూ ఐక్యపరచండి." అని తమ ఉపన్యాసాన్ని ముగించారు.

ఆనాటి సభ పూర్తి అయింది. సభకు మొత్తం 12 వేలకుపైగా వచ్చారు.

చిత్రకళా ప్రదర్శనం

మరుసటిరోజు 29 వ తేదీ సాయంత్రం సభకు ముందు చిత్రకళా ప్రదర్శనం తెరువబడింది. సోవియట్ చిత్రాలు, వివిధరాష్ట్రాల నుండి విద్యార్థి ఆర్టిస్టులు తయారుచేసిన చిత్రాలు, వివిధసంఘాలు నడిపిన వ్రాతపత్రికలతో ఎగ్జిబిషన్ అలంకరించబడింది. ఈ ఎగ్జిబిషన్‌లో ఆంధ్రులయొక్క ప్రత్యేకత లేకపోలేదు. విజయనగరం, కాకినాడ విద్యార్థులు నడిపిన వ్రాతపత్రికలు, విద్యార్థి చిత్రకారులు చోహిదాస్, సూరన్నవ్రాసిన రకరకాలైన చిత్రాలు ఎగ్జిబిషన్‌కు కొత్తఅందాన్ని చేకూర్చాయి. దీనిని కె. పి. చటోపాధ్యాయ (కలకత్తా విశ్వవిద్యాలయ ప్రొఫెసరు)గారు తెరచారు.

సుమారు10వేలమంది ఎగ్జిబిషన్‌దర్శించారు.

ఈరోజు సభలో డా. నళినాక్షసన్యాల్ (కాంగ్రెసు ఎసెంబ్లీ చీఫ్‌విప్) ఉపన్యసిస్తూ, "మీలోవున్న విభేదాలను రూపుమాపండి. సంయుక్తసంఘటనకు పాటుపడండి. బెంగాలులోని కొందరు విద్యార్థులలో యిప్పుడున్న విద్యార్థి సంఘం సామ్రాజ్యవాదులకు సాయపడుతున్నదనే నెపంతో వేరే సంఘాన్ని పెట్టపూనుకుంటున్నారు. ఇది కేవలం పొరపాటు. దీన్ని నేను వీలైనంతవరకు ఎదిరించాను.... కాంగ్రెసు ఒక వేదికగా వుండాలిగాని ఒక పార్టీగా వుండరాదు. అనేక రాజకీయాభిప్రాయాలు కలవారంతా వుండవచ్చు; వుండితీరాలి. అందరియొక్క ఆశయం భారతదేశ స్వాతంత్ర్యం అయివుండేచాలు. అదే విధంగా విద్యార్థులంతా ఒక సంఘంలోవుండి దేశస్వాతంత్ర్యమే తమ పరమలక్ష్యంగా పెట్టుకుని మీపాత్రను ఉచితరీతిగా నిర్వహించ గోరుతున్నాను." అంటూ తమ ఉపన్యాసాన్ని పూర్తిచేశారు.

తరువాత వైజ్ఞానిక ప్రదర్శనం ప్రారంభమైంది.

అస్సాం విద్యార్థులుచేసిన నాగాడ్యాన్సు, బెంగాలు, బొంబాయి దళాల కోరస్‌పాటలు, కేరళ విద్యార్థిచే "కథకళి" డ్యాన్సు, ఆంధ్ర విద్యార్థినియైన పరిపూర్ణచే కరువునృత్యం, గూర్ఖావిద్యార్థులు మహాసభపై వ్రాసుకొనివచ్చి పాడిన పాటలు యివి ప్రధానంగా చెప్పదగినవి. ఇందులో నాగడ్యాన్సు, పరిపూర్ణచే కరువునృత్యం ప్రేక్షకుల కోరికపై మరియొక్కసారి ప్రదర్శించబడ్డాయి. వైజ్ఞానిక ప్రదర్శనాన్ని శ్రీమతి సరోజినీనాయుడు చూచి చాలా వుత్సాహపూరితురాలైనది.

కల్చరల్ ప్రదర్శనంపై అభిప్రాయాన్నిస్తూ జెస్సోరు కాలేజీ ప్రిన్సిపాల్‌గారు యీవిధంగా చెప్పారు: "కొన్ని రుతువులలో మనకు ప్రత్యేక పండుగలకు మాత్రం జానపదాలు పాడుతూ డ్యాన్సులు చేసేవారు పూర్వకాలం. అవి యీరోజున అంధకారంలో వున్న ప్రజలను మేల్కొల్పడానికి ఈ విధంగా వుపయోగపడుతున్నాయి. వాటిని చూచి ఎంతో ఆశ్చర్యపోయాము. ఈవిధంగా కళను పోషిస్తూ ప్రజలకు అందుబాటులోవున్న పద్ధతులలో ప్రజలవద్దకు తమ సమస్యలను తీసుకొనివెళ్ళడంచూస్తే నిజంగాగర్వించాలి."

ప్రొఫెసర్ల డిబేటు

మరుసటిరోజు సభలో ప్రొఫెసర్ల డిబేటు జరిగింది. 15 మంది పాల్గొన్నారు. ఈవిధంగా ప్రొఫెసర్లు, విద్యాలయాధికార్లు సభకు సందేశాలు పంపడంగాని, సభలో మాట్లాడ్డంగాని, డిబేటులో పాల్గొనడంగాని చూస్తే విద్యార్థి ఉద్యమంలో నూతన అధ్యాయాన్ని నెలకొల్పారని చెప్పవచ్చు.

విద్యార్థుల డిబేటు

వివిధ రాష్ట్రాల నుంచి 25 మంది విద్యార్థులు వాగ్వాద పోటీలలో పాల్గొన్నారు. "స్వయం నిర్ణయసూత్రం పాకిస్తాన్‌కు వ్యతిరేకం" అనే విషయంపై చర్చ సాగింది. దీనికి అనుకూలంగానూ, వ్యతిరేకంగానూ విద్యార్థులు మాట్లాడారు. లక్నో ముస్లిం విద్యార్థిసంఘం తరపున వచ్చిన ఇస్లాం అనే విద్యార్థి ప్రథమ బహుమతిపొందాడు. తనకు బహూకరించబడ్డ వెండిపాత్రను ముస్లిం విద్యార్థి సంఘంయొక్క సౌభ్రాతృత్వ సూచకంగా తిరిగి అ॥ భా॥ వి॥ ఫెడరేషనుకు యిచ్చారు.

తీర్మానాలు

సందేశాలలోను, ఉపన్యాసాలలోనూ, అంతా కోరింది, ఐక్యవిద్యార్థి ఉద్యమాన్ని నిర్మించమని. తీర్మానాలు ప్రధానంగా దానినే ఆధారంగా చేసుకొని ప్రవేశపెట్టబడ్డాయి.

ఈదిగువ తీర్మానాలు మహాసభలో ప్యాసు చేయబడ్డాయి:

రాజకీయ తీర్మానం: "గాంధీ - జిన్నా సంప్రతింపులు విఫలమైనందుకు మేమెంతో విచారిస్తున్నాం. విఫలమయ్యాక కాంగ్రెసు - లీగ్‌లలో కొందరు ఒకరి నొకరు దూషించుకుంటున్నారు. ఇది మన దేశస్వాతంత్ర్యాన్ని వాయిదా వేయడానికి బ్రిటిష్ ప్రభుత్వానికి తోడ్పడుతుంది. కాబట్టి విద్యార్థులంతా నిష్పాక్షికంగా చర్చించి గాంధీ - జిన్నాలు తిరిగి కలుసుకోడానికి తోడ్పడాలని కోరుతున్నాం. కాంగ్రెసు - లీగు ఐక్యత ఒక్కటే నాయకులను విడుదల చేయించుకొని, జాతీయప్రభుత్వాన్ని సాధించి, ఫాసిజాన్ని నాశనంచేయడానికి మార్గమని నమ్ముచున్నాం"

విద్యార్థి ఐక్యతా తీర్మానం: "కాంగ్రెసు నాయకుల విడుదలకై ఆందోళన చేయడానికి, కరువునుండి ప్రజలను (మిగతా 7 వ పేజీలో)

★ రేషనింగు ఏరియాలలో

టోకువర్తకులు అవసరమా?

— టి. వెంకటేశ్వరరావు

మద్రాసు ప్రభుత్వం బియ్యం ధరను పెంచకుండానే, ధాన్యం ధరను పెంచడానికి అవకాశం ఉందంటూ ఒకవైపు అంగీకరించి, మరోవైపు యెంతవరకు పెంచాలో నిర్ణయించక పోవడంవల్ల స్థానికాధికారులు తమ చిత్తం వచ్చిన ధరలు నిర్ణయిస్తున్నారు. మిల్లు యజమానుల కొకరేటూ, పర్చేజింగ్ ఆఫీసరు కొకరేటూ, అమల్లో ఉన్నాయి. రైతు, ఎవరెక్కువ ధరయిస్తే వారికే అమ్ముదామని నిదానించి కూర్చుంటున్నాడు. కొత్త ధాన్యాన్ని నేడు రైతులు విరివిగా అమ్ముతున్నారు. వర్తకులు విపరీతంగా కొంటున్నారు. అయితే, ఈకొత్త ధాన్యానికి, కొత్త బియ్యానికి, జిల్లా కలెక్టరు ఇంతవరకు ధరలు ప్రకటించలేదు. గ్రామాలలోవర్తకులు బస్తా 1కి రు.10-8-0కు కొని, పాతధాన్యంతో కొంతకలిపి, మొత్తం సరుకంతా పాతధాన్యం కిందే చెలామణి చేస్తున్నారు. ఈ కల్తీబియ్యం తినలేక రేషనింగు ఏరియాలలో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. క్లిష్టపరిస్థితు లేర్పడినప్పుడే పర్చేజింగ్ ఆఫీసరు గ్రామాలమీద విరుచుకు పడతాడు. అప్పుడు ధాన్యం యెక్కడ్నుంచి వస్తుంది?

కొత్తగా టోకువర్తకులప్రవేశం

గోరుచుట్టుపై రోకటిపోటన్నట్లు, రేషనింగ్ ఏరియాలలో ఇప్పుడు కొత్తగా టోకు వర్తకుల్ని దింపుతున్నారు. డిశంబరు నెలాఖరు (1944) వరకు బెజవాడ, బందరు, గుడివాడ పట్టణాలలో మిల్లు యజమానులకూ - రేషన్ షాపులకూ మధ్య ప్రత్యక్షమైన సంబంధం ఉండేది. అందువల్ల మిల్లు యజమాని ప్రభుత్వం నిర్ణయించిన రు24-8-3 సీలింగు రేటుప్రకారం (సంచి లేకుండా రు 24-0-3) రేషన్ షాపులకు యిచ్చేవారు. అందువల్ల రేషన్‌షాపు వర్తకులు శేరు 0-3-9 కు (తోలకం 0-3-0, సేల్సుటాక్సు 0-4-0, లాభం 0-12-0, తరుగు 0-2-0 కలుపుకొని) యివ్వగలిగేవారు. అనగా బస్తా రు 24-0-3 + 1-5-0 = 25-5-3 లకు అమ్మేవారన్నమాట. కాని యీనాడు రేషన్‌షాపు వర్తకునికీ మిల్లు యజమానికీ మధ్య ప్రతిపట్టణంలో ముగ్గురు నలుగురు టోకు వ్యాపారస్థు లున్నారు. వీరు తమ లాభాలు, ఖర్చులు కలుపుకొని ఎక్కువ ధరలకు రేషన్ డిపోలవారికి అమ్ముతున్నారు. ఇందువల్ల బియ్యం ఖరీదు శేరు 1కి 0-0-2, అనగా బస్తా 1కి రు. 1-2-0 పెరిగింది. దీన్ని అనవసరంగా ప్రజలపై రుద్దుతున్నారు.

పంటలు పండని తరుగు ప్రాంతమైతే, దూరాన్నుంచి తెప్పించడానికి సహజంగా టోకు వ్యాపారస్తుల అవసరం ఉంటుంది. వారివద్ద చిల్లరవర్తకులు తమతమ పెర్మిట్ల ప్రకారం సరుకు కొనుక్కుంటారు. కాని, కృష్ణాజిల్లా పెద్దదాన్యం పండే ప్రదేశం. వివిధ కేంద్రాలలో రేషనింగ్ మిల్లులు, రేషన్ షాపులు ఒకే పట్టణంలో ఉన్నప్పుడు యిక టోకువర్తకుల అవసరం దేనికి? రైతువద్ద ధాన్యం రు. 10-8-0 కు కొంటున్నారు. మిల్లు యజమాని లాభం, టోకువర్తకుని లాభం, రేషన్‌డిపోలాభం యిన్ని లాభాలూ ప్రజలపై పడి, బియ్యంబస్తా రు. 26-7-0 వరకు పెరిగింది.

ఈ సందర్భంలో బెజవాడ రేషన్‌షాపు యజమానులు ప్రజల యిబ్బందులు గుర్తెరిగి, కృషిచేయుట సంతోషదాయకం. మిల్లు యజమానికీ, రేషన్‌షాపుకీ మధ్య టోకువర్తకుల అవసరం లేదనీ, అవసరమైనప్పుడు తామే తమ సంఘంద్వారా బయటనుంచి సరుకు తెప్పించుకుంటామనీ, ప్రభుత్వానికి తెలియజేశారు. పట్టణ ఆహారకమిటీ కూడా యీ సూచనే ఇచ్చింది. కాని, ప్రభుత్వం కదలడంలేదు.

డిపోలలో పాడు సరుకు

మొదట అన్నిడిపోలకు మంచిరకం బియ్యమే సప్లయిచేయబడుతూ ఉండేవి. కాని సుమారు ఒకనెల రోజులనుండి పాడుసరుకు యిస్తున్నారు. కొత్తబియ్యం, ముదిబియ్యం, కలిపి సప్లయిచేస్తున్నారు. మరికొంచెం పాలిష్‌యిస్తే దిగుబడి తగ్గుతుందని గ్రహించి, మిల్లు యజమానులు బియ్యాన్ని సర్టిఫైచేసే "ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల"ను వలలో వేసుకుని యీ అక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ఈవిషయం "డిప్యూటీ కమీషనర్ ఆఫ్ సివిల్ సప్లయిస్"కి మేము తెలియపరచినప్పుడు మా యెదుట పర్చేజింగ్ ఆఫీసరును రెండు కేకలువేసి 'ఇకముందు అలా జరగదులెండి!' అని జవాబు చెబుతున్నారు. కాని, అప్పుడే అవి గాలికి యెగిరిపోయాయి.

ప్రభుత్వ కర్తవ్యం

ప్రభుత్వం వెంటనే తనవిధానాన్ని మార్చుకొని, పాతపద్ధతి ప్రకారం ప్రజలందరికీ చౌకగా మంచిబియ్యం లభించేటట్లు చూడాలి. శేరు 0-0-2 లకు ధరపెంచి, ముతకబియ్యం ఇస్తే, వాటిని దంచుకునేసరికి కొంతతరుగుపోయి, ముప్పాతికశేరు మిగులుతుందనే విషయం గ్రహించాలి. రేషనింగును ప్రవేశపెట్టి, అది జయప్రదంగా కొనసాగాలని వాంఛించే ప్రభుత్వం యీ క్రింది చర్యలకు వెంటనే పూనుకోవాలి:

1. ధాన్యం ధర రు. 11 నిర్ణయించాలి. ఈధర సంవత్సరం పొడుగునా అమల్లో ఉండాలి, ఎవరుకొన్నా, యీధరకే కొనాలి.

2. రేషనింగు ప్రాంతాలకు, తరుగు ప్రాంతాలకు, సప్లయిచేసే నిమిత్తం ప్రభుత్వమే రైతువద్ద, ఎనిమిదోవంతు పంటను కొని నిలవచేయాలి.

3. టోకు వర్తకుల విధానాన్ని రద్దుచేసి, బియ్యం మామూలు ధరకు, అనగా శేరు 0-3-9 కు, అమ్మేటట్లు చూడాలి.

4. బియ్యానికి పాలిష్ సరియైన ప్రమాణానికి వచ్చేటట్లు చూడాలి. అలా తయారు చేయని మిల్లు యజమానులమీద చర్య తీసుకోవాలి. సరిగా సర్టిఫైచేయని "ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల"ను శిక్షించాలి. కల్తీసరుకుఅమ్మకుండా చూడాలి. సాధ్యమైనంతవరకు పాతబియ్యమే అమ్మేటట్లు చేయాలి.

★

ప్రభుత్వం యీటోకువ్యాపారస్తుల పద్ధతిని రద్దుచేయాలనీ, రేషన్‌డిపోలలో యిచ్చే కొత్తబియ్యం, ముతకబియ్యం ఆపి, కనీసం ఒకనెలవరకైనా పాతబియ్యాన్ని సప్లయి చేయించాలనీ, నిర్ణీత ప్రమాణంగల పాలిష్ లేకుండా బియ్యం తయారుచేసే మిల్లు యజమానుల్ని - ఆ బియ్యాన్ని సర్టిఫైచేసిన అధికార్లనూ శిక్షించాలని (మిగతా 6 వ పేజీలో)

బాలబాలికలకు

అబ్బాయిలూ! అమ్మాయిలూ! నేను పత్రికద్వారా మీతో మాట్లాడి చాలా కాలమయింది. కాగితం కోటా తక్కువయినందున డిసెంబరునెలలో పత్రికను 6 పేజీలు చొప్పునే ముద్రించారు. ఉన్నకొద్దిలో సంపాదకులు మనకు స్థలం యివ్వలేకపోయారు. ఇక్కడనుంచి ప్రభుత్వం పత్రికలకు కాగితం ఎక్కువ చేసింది. అందుచే ముందునుంచి 10 పేజీలు అచ్చువేస్తారు. మనకు తప్పకుండా చోటు దొరుకుతుంది.

నేనంటే వ్రాయలేముగాని ముద్దుబిడ్డలు, బాలసంఘాల సభ్యులు ప్రతివారం జాబులు వ్రాస్తూనేవున్నారు. నాదగ్గర ఎన్నో ఉత్తరాలు పేరుకుపోయివున్నాయి. ఇప్పటికే ఆలస్యమయింది. అవన్నీ ప్రకటించడం సాధ్యమూకాదు. ఏవో కొన్ని ముఖ్యమైన కబుర్లుచెప్పి యీసారికి ముగించుతాను. మీదొడ్డమ్మమీద అలగకండేం!

రాజమహేంద్రవరంనుంచి బాలసంఘం క్రొత బాలసంఘానికి ఆదర్శప్రాయంగా బహిరంగసభ జరిపినందుకు అభివందనాలు తెలిపింది. ఇంతేకాదు. ఈసంఘంవారు చక్కని కృషిచేశారు చూడండి. విశాఖజిల్లాలో కరువువల్ల తిండిలేక కాందిశీకులు రాజమండ్రి వచ్చారు. వారికి జీవకారుణ్యసంఘంవారు అంబలి కాచి పోశారు. మన బాలసంఘం వీరేశలింగంగారి చరిత్రను బుర్రకథగా చెప్పింది. వచ్చినడబ్బులో 12 రూపాయలు జీవకారుణ్యసంఘంవారికి యిచ్చారు. చిన్నవాళ్ళయినా, నాబిడ్డలు ఎంత చక్కనిపని చేశారో చూడండి! వారికి నా ఆశీస్సులు.

అత్కూరు బాలసంఘం దసరారోజుల్లో నగర సంకీర్తనం చేశారు. కరువు నిధికి రు. 7-12-0 వసూలు చేశారు. విశాఖకు పంపమని "ప్రజాశక్తి" ఆఫీసుకు పంపారు.

ఉప్పుగుండూరు బాలసంఘం వార్షికోత్సవం చక్కగా జరిపింది. బాలబాలికలు ఆటపాటలలో పాల్గొన్నారు. బహిరంగసభ చేశారు. పెద్దలు తమపిల్లలుచేసే పని చూచి మురుసుకున్నారు. పిన్నలంటే పెద్దలకుముద్దు. పెద్దలంటే పిన్నలకు గౌరవం. అలావుండాలి మరి! బాలసంఘాలు పిల్లలను బాగుచేస్తుంటే, ఎవరడ్డు పెట్టగలుగుతారు, అసలు! ఇలాగే కొత్తపట్నం బాలసంఘంకూడ వార్షికోత్సవం జరిపింది.

అంతర్వేదిపాలెం బాలసంఘం చక్కగా పని ప్రారంభించింది. చూడండి మరి! చదువుకోటానికి కొందరి పిల్లలకే అవకాశముంది. మరి బీదవారి బిడ్డలున్నారే! వారు చదువుకోలేరు. పాపం! చిన్నప్పటినుంచీ గొడ్లను కాయడమో, పాలేరుతనమో చేయాలి. పొట్ట పోసుకోవాలి. పగలు బడికెళ్ళి చదువుకునేపిల్లలు అలాంటిపిల్లలకు రాత్రిళ్ళు చదువు చెబితే ఎంత బాగుంటుంది! అంతర్వేదిపాలెం బాలసంఘం ఆపని ప్రారంభించింది. అబిడ్డలు పట్టుదలతో పనిచేయాలని కోరుతున్నాను. వారికి నా ఆశీస్సులు.

ఊళ్ళో అవసరమైన పనులు చేయడంలోకూడ బాలసంఘాలు ముందుకొస్తున్నాయి. ఆలా పెదపాడు గ్రామంలో బాలసంఘసభ్యులు 30 బళ్ళ యిసుకను బుట్టలతో మోసి, పుస్తక భాండాగారం బాగుచేయడానికి సాయపడ్డారు. పదిమంది పిల్లలు కలిసిచేస్తే ఆటగానూ వుంటుంది; ఉపయోగమూ వుంది. మనం కలిసి ఒక మంచి పని చేశామంటే, నిజంగా ఎంత హుషారుగా వుంటుంది!

కాటూరు బాలసంఘంకూడ మట్టితవ్వలో పాల్గొని సంఘానికి 5 రూపాయలు సంపాదించింది. ప్రతివారం వక్తృత్వపోటీలు జరుపుతున్నారు.

నర్సాయపాలెం బాలసంఘం ఒకఎకరం వరికోత కోసింది. వచ్చిన 6 రూపాయల డబ్బుతో పుస్తకాలు తెప్పించుకోవాలని తీర్మానించారు. అలా వుండాలిమరి! ఒకవైపున శరీరశ్రమ చేయాలి. మరోవైపున విజ్ఞానం సంపాదించాలి. ఇది మన బాలసంఘాల ఉత్తమ ఆదర్శం.

ఇక మన బాలసంఘాలు ఆంధ్రదేశం మూలమూలలకు ఎలా వ్యాపింతున్నాయో చూడండి!

సికిందరాబాద్‌లో చిలకలగుడా అనే పేటవుంది. అచట పద్మఅనేఅమ్మాయి బాలసంఘం స్థాపించిందట. విఠల్‌మూర్తి అనే రెండోఫారమ్ బాలుడు నాకు జాబు వ్రాశాడు. పద్మక్క సంఘం పెట్టినాక అదివరకు చేసే అల్లరులు మానివేశాడు ఆ పిల్లడు. ఇపుడు బాగుగా చదువుతున్నాడట. క్లాసులో ఫస్టుగా వస్తానని నాకు ఉత్తరం రాశాడు.

పిల్లలందరూ అదే ఆదర్శంతో చదవాలి. చదివి, విజ్ఞానం సంపాదించి, పంతుళ్ళను మెప్పించాలి. అల్లరిలేకుండా చక్కగా మెలగి, తలితండ్రుల మెప్పుపొందాలి. శుభ్రంగా వుంటూ, ఆరోగ్యం సంపాదించాలి. పిల్లలూ! యిక నే వెళ్ళవస్తా!

— మీ దొడ్డమ్మ

బందరులో జహీర్ గారికి అఖండసన్మానం

జహీర్‌గారు జనవరి 1 వ తేదీ సాయంకాలం 3 గంటలకు బందరు చేరారు. ఆ సాయంత్రమే ముస్లింలీగ్, సోవియటు మిత్రమండలి, అభ్యుదయరచయితలసంఘాల యాజమాన్యాన బహిరంగసభ జరిగింది. స్థానిక ముస్లింలీగ్ కార్యదర్శి నయీం సాహెబుగారు అధ్యక్షత వహించారు. "కాంగ్రెసు - లీగ్ ఐక్యత" పై మాట్లాడుతూ జహీర్‌గారు కాంగ్రెస్ - లీగుల చరిత్రను గురించి విపులంగా ముచ్చటించారు. కాంగ్రెసుసంస్థ నానాటికి అభివృద్ధి అవుతున్న కొద్దీ, "బ్రిటిష్ ఆధిపత్యంక్రింద స్వపరిపాలన" అనే ఆశయం క్రమక్రమంగా అది విదేశ స్వాతంత్ర్యంలోకి, చివరకు సంపూర్ణ స్వాతంత్ర్యంలోకి ఎలా మారుతూ వచ్చిందో వివరించారు. అదే రీతిగా ప్రత్యేక నియోజక వర్గాలే ఒకప్పుడు తన ఆశయంగా యెంచిన ముస్లింలీగ్, యీ రోజున పాకిస్తానును పరమావధిగా పెట్టుకున్నది. పాకిస్తాన్ మత సంబంధమైన కోర్కె కాదనీ, అది ముస్లిముల పవిత్ర స్వాతంత్ర్య వాంఛ అనీ జహీర్‌గారు స్పష్టంగా వివరించారు. సర్వజనాంగీకారం (ప్లెబిసైటు) అగత్యమని అన్న గాంధీజీ అభిప్రాయానికి, ముస్లిం జన్మభూములకు సర్వ సంపూర్ణమైన స్వాతంత్ర్యం అవసరమని వాదించిన లీగ్ కోర్కెకూ, మూలసిద్ధాంతాలలో విరుద్ధంలేదని విశదీకరించారు. ముస్లిములు అధికసంఖ్యాకులుగా ఉన్న ప్రాంతాల్లో వయోజనాంగీకారంపై యేర్పాటయ్యే ప్రజా పరిషత్తులచే నిర్మింపబడ్డ రాజ్యాంగచట్టంవల్ల ఈ సమస్య పరిష్కారమవుతుంది. హిందూ, ముస్లిముల మధ్య పరస్పర విశ్వాసమనేది ఉంటే, యిలాంటి సమస్యలన్నీ సునాయాసంగా పరిష్కారమవుతాయని జహీరుగారన్నారు.

తమ తమ స్థానిక సమస్యలను పరిష్కారం చేసుకోడానికి హిందూ - ముస్లిములు భుజం భుజం కలిపి పనిచేయడంద్వారా తిరిగి గాంధీ - జిన్నాలను కలపాలని చెప్పారు.

ఉపన్యాసానంతరం ముస్లిం వాలంటీరు జహీరుగారికి గౌరవ పురస్సరంగా వందనాలర్పించారు (గార్డ్ ఆఫ్ ఆనర్).

తర్వాత జరిగిన బ్రహ్మాండమైన ఊరేగింపులో పెందలకొలది హిందూ-మహమ్మదీయులు అమితోత్సాహంతో ఐక్యతా నినాదాలుచేస్తూ పాల్గొన్నారు.

ముస్లింలీగ్ ఆధిపత్యంక్రింద జరిగిన మరొక సభలో జహీర్‌గారు ఉర్దూలో ఉపన్యసిస్తూ, మానవునిచే మానవుడు పీడించబడడం అంతరించాలని అన్నారు. మధ్య ఆసియాలో (సోవియట్ యూనియన్) ముస్లింజాతులు గత 25 సంవత్సరాలుగా పొందిన సర్వతోముఖాభివృద్ధిని, నూతన వికాసాన్ని వివరించారు.

అంజమానెయూద్దర్ హుస్సేని - రు జహీర్‌గారికి స్వచ్ఛందసేవక పతాకాన్ని బహూకరించారు.

శ్రీ వి. వి. కె. సుబ్రహ్మణ్యంగారి అధ్యక్షతక్రింద ఆంధ్ర ఇన్సూరెన్సు భవనంలో మరొక సభ జరిగింది. "బానిస దేశాల స్వాతంత్ర్య పోరాటాలకు సోవియట్ రష్యా యెలా సహాయపడుతోంది?" అనే విషయంపై జహీర్‌గారు మాట్లాడుతూ, వివిధ జాతులకు సోవియట్ ప్రభుత్వం యెలా స్వాతంత్ర్యమిచ్చిందో, వెనుకబడియున్న ముస్లింజాతులకు, సోవియట్‌లోని యితర ఆసియా ప్రజలకు సర్వతోముఖమైన అభివృద్ధి చెందుటకు యెలా దోహదమిచ్చిందో, జహీర్‌గారు వివరించారు. రెడ్ఆర్మీ విజయ పరంపరలు ప్రపంచ ప్రజా ఉద్యమాలను యెలా బలపరుస్తున్నవో, సోవియట్ విధానం యే విధంగా సామ్రాజ్యవాద వ్యతిరేకమో విశదీకరించారు.

గుంటూరుజిల్లా ప్రజాఆహారకమిటీ సమావేశ నిర్ణయాలు

ది 2-1-45 న సాయంత్రం గుంటూరులో 6-30 గంటలకు శ్రీ పి. యస్. టి. రాయి. బారెట్లాగారి అధ్యక్షతను గుంటూరు మండల ప్రజా ఆహారకమిటీ సమావేశమైంది. జిల్లాలోని ఆహారపరిస్థితిని గురించి తాలూకా ప్రతినిధులు తెలియజేసిరి. దానిమీద వెంటనే ఫిబ్రవరి 4 వ తేదీని జరుగబోవు ద్వితీయ మండల ఆహారమహాసభను జయప్రదం చేయుటకు, 1945 వ సంవత్సరంలో ఆహార సమస్యా పరిష్కారానికి గతసంవత్సరం అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఒక సరియైన ప్లాను, కార్యక్రమం నిర్ణయించుటకు, సమాచారాన్ని సేకరించే ఒక ప్రశ్నావళిని తయారుచేయడమైనది.

ఈ ప్రశ్నావళిని అన్ని తాలూకా, గ్రామ ఆహారకమిటీలకు పంపించినమీదట యీ ప్రశ్నావళిని చర్చించి, సమస్యా పరిష్కార మార్గములు సూచించుటకుగాను జనవరి ఆఖరిలోగా తాలూకాకమిటీలు సమావేశాలుఏర్పరచి, ఆ సూ తేదీలను జిల్లాకమిటీకితెలియజేయవలెను. తాలూకాకమిటీ సమావేశాలకు జిల్లా అధ్యక్షకార్యదర్శులలో ఒకరు హాజరౌతారు.

సాధ్యమైనంతవరకు ప్రతి గ్రామంలోను ఒక ఆహారకమిటీని స్థాపించవలెననియు, కనీసం పదిమైళ్ళ ఏరియాకు ఒక కేంద్ర ఆహారకమిటీని, వీలైనంతవరకు ఒకకో-ఆపరేటివు స్టోర్సును ఏర్పాటుచేయుటకు వెంటనే తీవ్రమైన కృషిచేయవలెనని తీర్మానించారు.

కావలిలో బియ్యపు కరువు సూచనలు

ఈసంవత్సరం కావలితాలూకా (నెల్లూరు జిల్లా)లోని గ్రామాల్లో కొనుగోలుకు ఎక్కడా ధాన్యంలేదు. కొత్తధాన్యం మార్కెటుకు రావడానికి రెండునెలలు పడుతుంది. అందువల్ల కావలి పట్టణానికి రెండునెలలవరకూ బియ్యంరావు. పట్టణమందలి 16 వేలమంది ప్రజల్లో 10 వేలమంది నిత్యం మార్కెట్లోనే బియ్యం కొనుక్కొని తినవలసిఉంది. కాని, ప్రస్తుతం కావలిలో 350 పుట్ల ధాన్యంమాత్రమే ఉన్నాయి. పదిరోజులక్రితం ప్రభుత్వం 80 టన్నుల బియ్యాన్ని రిక్విజిషన్‌చేసి పైకి ఎగుమతిచేసింది. మరో 75 టన్నులు ఎగుమతి చేయమన్నది. (ఇది 3-1-45 తేదీ రిపోర్టు). మిగిలిన సరుకు కావలి పట్టణ పౌరులకు 2 నెలలవరకు సరిపోదు. రోజుకు 8 పుట్ల బియ్యం చొప్పున అంచనావేస్తే, మొత్తం 10 వేలమంది జనాభాకి యీ 2 నెలలకూ 600 పుట్లు బియ్యం అవసరం. కాని, ఇప్పుడున్న ధాన్యం 358 పుట్లు మాత్రమే. కాబట్టి, కావలి పట్టణానికి మరొక 600 పుట్లు ధాన్యం దిగుమతిచేయవలసిన పరిస్థితుల్లో, ప్రభుత్వం యిచ్చటి సరుకును రిక్విజిషన్‌చేసి ఎగుమతిచేయడం ప్రమాదకరమనీ, వెంటనే ఈవిధానాన్ని మాని, అదనపుసరుకు పైనుండి తెప్పించే యేర్పాట్లుచేయవలసిందనీ, కోరుతూ జి. వి. కొండయ్యగారు ప్రకటిస్తున్నారు.

ఆత్మకూరు తాలూకాలో ధాన్యం ధరలు

ప్రస్తుతం నెల్లూరులో వర్తకులు పుట్టి 1 కి రు. 148 (పుట్టి 12½ బస్తాలు; బస్తాకు 164 పౌనులు) చొప్పున ధాన్యం కొంటున్నారు. బియ్యం బస్తా నెల్లూరులో రు. 18-14-6 కు గిట్టుతోంది. కాని, ఆత్మకూరులో పుట్టి 1 కి రు. 144 కు కొని, బియ్యంబస్తా 1 కి రు. 18-14-6 ధరకే అమ్ముతున్నారు. ఈ విధంగా మిల్లువ్యాపారస్తులు, టోకువర్తకులు, అధికలాభాలు గుంజుతున్నారు. అందువల్ల, ధాన్యపుధర రైతుకు మిల్లువద్ద పుట్టి రు. 148 గిట్టేటట్లు నిర్ణయించమని ప్రభుత్వాన్ని కోరుతూ ఆత్మకూరు తాలూకా రైతుసంఘం తీర్మానించింది.

కాంగ్రెసును విడిచివెళ్లాలని ముస్లింలను కోరము

కమ్యూనిస్టు నాయకుడైన సజ్జాద్ జహీర్ గారిలా ప్రకటిస్తున్నారు:

"ఉత్తర భారతదేశంలోను, యితరత్రా కూడా హిందీ - ఇంగ్లీషు పత్రికలు నాతు మిత్రులైన డాక్టర్ అహమ్మద్, డాక్టర్ అష్రాఫ్, నేను కలిసి సంయుక్త రాష్ట్రాల్లో సంచారం చేస్తూ, ముస్లిం కాంగ్రెసువాదుల్ని కాంగ్రెసు వదలిపెట్టి ముస్లింలీగ్‌లో చేరమని కోరుతున్నట్లుగా మాపై ప్రచారం గావిస్తున్నాయి. ఇంతకన్న హేయమైన కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారం మరొకటుండబోదు. కాంగ్రెసు వాదులను కమ్యూనిస్టుల యెడ ప్రతికూలురుగా చేయుటకై పన్నిన పన్నాగమే యిది.

"కమ్యూనిస్టులమైన మేము కాంగ్రెసు-లీగ్ సంస్థల రెంటిని సోదరప్రాయంగా ఐక్యపరచుతూ, జాతీయ ప్రభుత్వ సముపార్జనకై కృషచేస్తున్నాం. ముస్లిం కాంగ్రెసువాదులను కాంగ్రెసునుండి విడిపోయి లీగ్‌లో చేరమని ప్రచారం చేయడంవల్ల, రెండు సంస్థలూ ఐక్యంగాకపోగా, వాటిమధ్య వైరుధ్యం అధికమవుతుందనే విషయం స్పష్టమే.

"నిజానికి ముస్లిం కాంగ్రెసు వాదులు కాంగ్రెసులోనే ఉండాలనీ, ముస్లింలీగ్ కోర్కెలను గూర్చి తమ సోదర కాంగ్రెసువాదులకు నచ్చచెప్పి సుముఖులుగా చేయడంద్వారా కాంగ్రెస్ - లీగుల నడుమ ఐక్యత చేకూర్చాలనీ వారికి మేము విన్నవిస్తున్నాం.

"ఇదేవిధంగా, కాంగ్రెసు వాదులతో, ముస్లిం లీగర్లు సోదరతుల్యమైన ఐక్యతతో మెలగుతూ, కాంగ్రెసు వాదుల విడుదలకై కృషి చేస్తేనే తప్ప, పాకిస్తాన్ ఆశయం సిద్ధించ నేరదని విన్నవించుతున్నాం. సంయుక్త రాష్ట్రాలలో యిటీవల మేము కలుసుకొన్న ముస్లిం కాంగ్రెసువాదులగు మౌలానాహిఫ్జుర్ రహమాన్, ముజఫర్ హుస్సేన్, మౌలానాషాహిద్ ప్రభృతులు పైవిషయం యదార్థమని రుజువు చేస్తారు".

(5 వ పేజీ తరువాయి) కోరుతూ, యీక్రింది వారు ఒక సంయుక్తప్రకటన గావిస్తున్నారు:

టి. వెంకటేశ్వరరావు (బెజవాడ పట్టణ ఆహారకమిటీ, కార్యదర్శి); జె. సత్యనారాయణ (బెజవాడ పట్టణ ట్రేడ్‌యూనియన్ కౌన్సిల్ కార్యదర్శి); కుందేరు సత్యనారాయణ, బి. ఏ., బి. ఎల్., (కృష్ణా కోఆపరేటివ్ స్టోర్సు); కల్లూరి శ్రీరామమూర్తి ఎం. బి., బి. ఎస్. (బెజవాడ మెడికల్ ఎసోసియేషన్ కార్యదర్శి) బుర్రా లక్ష్మీనారాయణ (బియ్యం రేషను షాప్స్ ఎసోసియేషన్ ఉపాధ్యక్షుడు); షేక్ మహబూబ్ ఆదం (యంగ్ మెన్స్ ముస్లిం ఎసోసియేషన్ కార్యదర్శి); వి. రాజగోపాలాచారి, బి. ఏ., బి. ఎల్. (కృష్ణాజిల్లా ప్రజాఆహారకమిటీప్రెసిడెంటు); గోటేటి లక్ష్మీనారాయణ, బి. ఏ., బి. ఎల్. (బార్ ఎసోసియేషన్ ప్రెసిడెంటు) జె. వి. రమణమూర్తి (కృష్ణా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ ఎసోసియేషన్ ప్రెసిడెంటు).

ఈకోర్కెలను బలపరుస్తూ 6000 మంది బెజవాడ పౌరులు ప్రభుత్వానికొక మహజరు పెట్టారు.

11-1-45 తేదీని బెజవాడ గాంధీపార్కులో జరిగిన బహిరంగసభలో పైవిజ్ఞప్తినే బలపరుస్తూ తీర్మానం గావించబడింది. సభకు కాద్రగడ్డ రాజగోపాలరావుగారు అధ్యక్షత వహించారు. బెజవాడకు నేడు కట్టెలు విరివిగా సప్లయి అవుతూండడంవల్ల, కంట్రోలుధరను సలక 0-15-9 నుండి 0-11-3 కు తగ్గించవలసిందనీ; బియ్యపు రేషనుకార్డుల ప్రకారం అన్నికుటుంబాలకూ కిరొసిన్ కార్డులు కూడా కొత్తగా తయారుచేసి యివ్వాలనీ; యీలోగా బియ్యపు కార్డుమీద ఉన్న పేరూ, కిరొసిన్ కార్డుపై ఉన్నపేరు ఒకటిగా ఉండేనే తప్ప కిరొసిన్ యివ్వరాదనే కొత్త ఉత్తరువును రద్దుచేయాలనీ; మధ్యతరగతి ప్రజలకు అవసరమయే కలాలు, గడియారాలు, ప్లాష్టులు, సైకిళ్ళు, బ్లేడ్లు వగైరాల సప్లయి బెజవాడ వంటి పెద్దపట్టణానికి సరిపోనందున, ఆ వచ్చిన సరుకైనా స్థానికాధికారులకే ముందుగా తెలియడంవల్ల వారే ఎక్కువభాగం కొనుక్కోవడంవల్ల, ప్రజలు యిబ్బంది పడుచున్నారు కాబట్టి, అట్టి అధికారులచర్యను విరమించుగూ తీర్మానాలు చేయబడ్డాయి.

"ఆర్థికస్వాతంత్ర్యం లేనిదే స్త్రీలకు ఆత్మగౌరవం సున్న"

హిందూ లా సవరణ బిల్లుపై శ్రీమతి సరోజనిదేవి

కలకత్తా యూనివర్సిటీ ఇన్‌స్టిట్యూట్ హాల్లో యీనెల 1 వ తేదీ సాయంకాలం హిందూ లా-సవరణ బిల్లును చర్చించడానికి బ్రహ్మాండమైన బహిరంగసభ జరిగింది. ఎంతో విశాలమైన ఆ హాలు ప్రేక్షకులతో క్రిక్కిరిసిపోయింది. పై భాగంలో కూడా ఎక్కడా ఖాళీలేదు. హాలుబయట ప్రజలు తండోపతండాలుగా గుమిగూడి, దూరశ్రవణ యంత్రంద్వారా వచ్చే ప్రతిమాటను శ్రద్ధతో వింటున్నారు. వచ్చిన ప్రేక్షకుల్లో అనేకమంది స్త్రీలున్నారు.

శ్రీమతి సరోజినీనాయుడు సభ కధ్యక్షత వహిస్తూ, ఉత్తేజపూరితమైన ఉపన్యాసం యిచ్చారు: "జీవితం సౌఖ్యవంతంగా ఉండాలంటే, దేశ, కాల పరిస్థితుల కనుగుణ్యంగా నడుచుకోవాలి. మన తాత ముత్తాతలు మనకిచ్చిన విజ్ఞానసంపద గర్వించదగినదేగాని, మనతరువాత వచ్చే తరాలవారు మనపై దోషారోపణలు చేయడానికి మన మవకాశ మీయకూడదు. కాలవాహినితోబాటు మనంకూడా ముందుకుకదలకపోతే, ముప్పుతప్పదు; ఎవరితోనూ సంబంధంలేని ఒంటెత్తుజీవితం గడపవలసివస్తుంది; క్రమంగా బూజుపట్టిశిథిలావస్థకు జారిపోతాం. ప్రవాహం యెక్కడ జోరుగా ఉంటుందో, అక్కడ దానికి అడ్డుకట్టవేసి, ఆ నీటిని మానవుని ఉపయోగార్థం మరొక మార్గానికి మళ్ళిస్తాం గదా!

"ఈ బిల్లు ఆచరణలోకి వస్తే, సమిష్టి కుటుంబాలు విచ్ఛిన్నమవుతాయని కొందరి వాదన. కాని పరిస్థితుల ఒత్తిడివల్ల, యిదివరకే మనదేశంలో సమిష్టి కుటుంబపద్ధతి మాయమైంది. కాని, దీన్నిబట్టి మనకొడుకుల మీద, కూతుళ్ళమీద, మనకుగల ప్రేమమాత్రం చెక్కుచెదరలేదు. ఈరోజున మీకుమార్తెల్లో చాలామంది విద్యావతులై ఉన్నారు. కాని మీ తల్లులో? వారి కెట్టి విద్యాగంధములేదు. మీ కూతుళ్ళు బియ్యేలూ, ఎం.ఏ. లూ, ఎం.ఎస్. సీలు ప్యాసయారు. 'నాకూతురు యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా పనిచేస్తూంది,' అని మీరు గర్వంతో చెప్పుకుంటారు అయితే, ఆర్థికంగా స్త్రీఎట్టిదీనస్థితిలోఉందో ఆలోచించండి. ఒకరిపై ఆధారపడవలసిన స్త్రీకి ఆర్థికంగా స్వాతంత్ర్యం యెక్కడిది? మీ కుమాళ్ళకెంత ఆత్మగౌరవం ఉందో, మీ కూతుళ్ళకు కూడా అంతే ఆత్మగౌరవం ఉండాలి. కాని ఆర్థిక స్వాతంత్ర్యం లేనిదే ఆత్మగౌరవం రాదు.

"నేను మీకు చెప్పేదల్లా ఒక్కటే. మీరు హిందూసమాజంయొక్క అభివృద్ధిని, సంస్కరణను, కోరుతున్నారా? దాన్ని యిప్పటి కంటె ఉన్నతస్థితికి తీసుకువెళ్ళడం మీ అభిమతమేనా? లేక, మీకు ఉన్న అపోహలతో హిందూసమాజాన్ని ఛిన్నాభిన్నం చేయదలచుకున్నారా? మీరు మీచేతులతోనేమీకూతుళ్ల గొంతుకలు పిసికివేయదలచుకున్నారా, లేక, ముందుముందు రాబోయే స్వేచ్ఛాప్రపంచంలో వారికికూడా ఉచితమైనస్థానమిచ్చి అభ్యుదయ మార్గంవైపు నడిపించదలచుకున్నారా? ఈ ప్రశ్నలు మిమ్మల్ని మీరువేసుకోండి: ఈ సమస్యను మీరు జాగ్రత్తగా పరిశీలించండి. సవరణబిల్లులో ఏయేమార్పులు కావాలో వివరాలతోసహా సూచనలివ్వండి. ఏ క్లాజు మంచిదో, ఏదిమంచిదికాదో, సలహాలివ్వండి. మీబాధ్యతలను మీరు బాగా గుర్తెరిగి, బుద్ధికుశలతతో, భవిష్యత్తుపై దృష్టిని నిలిపి, సూచన లివ్వండి."

అన్నిపక్షాలవారుకలిసి ప్రజలకు సాయంచేయాలి

— శ్రీమతి సరోజినీదేవి

గత డిసెంబరు 28 వ తేదీని బెంగాల్‌లో శ్రీమతి సరోజనీనాయుడు, చౌదరీమోజం హుస్సేన్, సేన్‌గుప్తాసతి, కలిసి, నరికేల్‌డంగా కరువునివారణ కమిటీ ఆధ్వర్యంకింద నడుపబడే కేంద్రాలకు వెళ్లారు. బెంగాల్ మహిళాసంఘ కరువునివారణ కమిటీవారిని, ముస్లింలీగ్ కరువునివారణ కమిటీవారిని, ట్రేడ్‌యూనియన్ కేంద్రానికి సంబంధించిన వారిని, కలుసుకొని మాట్లాడారు. సంచార కార్యక్రమం పూర్తిచేసుకుని, తిరిగి నరికేల్‌డంగా కరువునివారణ కేంద్రానికి వచ్చారు. అక్కడి ప్రచారకులకు శ్రీమతి సరోజనీదేవి క్రింది విధంగా ఉపన్యసించారు:

"ఇక్కడిస్థానిక ప్రజలు రాజకీయ, సాంఘిక విభేదాలతో ప్రసక్తిలేకుండా, ప్రజలకు సహాయంచేయడంలో కలిసి పనిచేయడం చూచి నాకెంతైనా సంతోషం కలుగుతోంది. బెంగాల్‌లో సంక్షోభం అతి తీవ్రరూపం దాల్చింది. సంక్షోభ సమయాల్లో రాజకీయ కక్షలకంటె ప్రజాసేవయే ఎక్కువ ప్రధానమనే విషయం యీ ఐక్య కృషివల్ల రుజువౌతూంది. పరస్పర అనుమానాలు, సాంఘిక విభేదాలు మన భారతభూమిని వెనక్కు లాక్కెడుతున్నాయి. కాని, మీ ఐక్యకృషి దేశీయులందరికీ ఒకమార్గం చూపుతూంది. స్వాతంత్ర్య సంపాదనకు యింకా విశాలమైన ఐక్యతను నిర్మించడానికి పునాదులు వేస్తోంది."

కాంగ్రెసు వాదులు, ముస్లింలీగర్లు, కమ్యూనిస్టులు కలసి పనిచేస్తున్న "రిలీఫ్ కో-ఆర్డినేషన్ కమిటీ" నుంచి కాంగ్రెసు వాదులు రాజీనామా యివ్వాలా? అక్కరలేదా? అనే ప్రశ్నకు ఆమె ఇలా జవాబుచెప్పారు: "ప్రతివారూ - వారు కాంగ్రెసువాదులు కానీయండి, ముస్లిం లీగర్లు కానీయండి, కమ్యూనిస్టులు కానీయండి—ప్రజలకు సహాయం చేయడంలో కలిసి పనిచేయాలి. ఐక్యకృషికి దూరంగా ఉండమని సలహా చెప్పేవారెవరిమాటా మీరు వినవద్దు. కాంగ్రెసువాది చెప్పినాసరే! వాని మాటలను మీరు లెక్కచేయవద్దు."

("హిందుస్థాన్ స్టాండర్డు" పత్రికనుండి)

★ సోదరవిద్యార్థులకు విజ్ఞప్తి

ఆంధ్రరాష్ట్ర విద్యార్థి ఫెడరేషను కార్యనిర్వాహకవర్గం జనవరి 2, 5 తారీఖులలో విజయనగరంలో సమావేశమై యీ క్రింది తీర్మానములను అంగీకరించింది.

— చీమూరు, అస్థి కేసులలోని ముద్దాయిలకు ఉరిశిక్షలను రద్దుజేయమని ప్రభుత్వమును గోరుచూ తీర్మానింపబడినది. అన్ని స్థానిక సంఘములు యీ సమస్యపై తీవ్రాందోళన సాగించాలని తీర్మానించబడింది.

— మరియొక తీర్మానములో 8 వ అఖిల భారత విద్యార్థి ఫెడరేషను మహాసభలో అంగీకరింపబడిన తీర్మానము లన్నిటిని అంగీకరించుచు, అఖిల భారత విద్యార్థి ఫెడరేషను యెడల సంపూర్ణ విశ్వాసాన్ని ప్రకటించినారు. నేడు అఖిల భారత విద్యార్థి ఫెడరేషను సూచించినట్లు కాంగ్రెసు - లీగు కలయికకు కృషిజేయుటకు - జాతీయ ప్రభుత్వ నిర్మాణమునకు - కాంగ్రెసు నాయకుల విడుదలకు-విద్యార్థిహక్కుల రక్షణకు, ఐక్యకృషికి ముందుకు రమ్మని విద్యార్థి కాంగ్రెసుకు విజ్ఞప్తి వేయుచున్నది.

ఆంధ్రరాష్ట్రములో విద్యార్థి కాంగ్రెసును కాంగ్రెసు అనుబంధసంస్థగా గుర్తించబడుతుందనే శ్రీ కాశేశ్వరరావుగారి ప్రకటనపై, రాష్ట్రవిద్యార్థి ఫెడరేషను కార్యదర్శి శ్రీ ఎన్. వి. నరసయ్యగారు యిచ్చిన పత్రికాప్రకటనను కార్యనిర్వాహకవర్గం ఏకగ్రీవంగా ఆమోదించినది.

— కాంగ్రెసు నాయకులు కొందరు నేడు విద్యార్థులలోనున్న చీలికలు పూడ్చుటకు బదులు, ఒకపక్షమును బలపరచుటకు చింతించుచు స్వతంత్ర ఐక్యవిద్యార్థి ఉద్యమ నిర్మాణమునకు కృషిజేయుమనీ, అఖిల భారత విద్యార్థి ఫెడరేషను విద్యార్థి ఐక్యతను విచ్ఛిన్నంచుటకు జేయు ప్రయత్నములకు తోడ్పడవలదని కాంగ్రెసు నాయకులకు విజ్ఞప్తిజేయుచు తీర్మానింపబడినది.

రావుకమిటీ బిల్లునకు విద్యార్థి ఫెడరేషను తరపున కార్యదర్శిచే పంపబడిన సూచనలను కార్యనిర్వాహకవర్గం అంగీకరించింది.

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పెద్దెంబరు క్లాసులు; మాతృభాషలో బోధన - విద్యార్థులకు హెచ్చు పౌరసత్వహక్కులు - మాతృ టెక్నికల్ కళాశాలలు వగైరా ప్రారంభించవలయునని రాష్ట్రమంతటా ఆందోళన చేయుటకు తీర్మానించడమైనది. ఆంధ్ర విద్యావేత్తలకు, సెనేటు సభ్యులకు - పత్రికాధిపతులకు-కాంగ్రెసు నాయకులకు ఆందోళనను బలపర్చమని విజ్ఞప్తి జేయబడినది.

జనవరి 20 నుండి 26 వరకు రాష్ట్రవిద్యార్థి ఫెడరేషను ఆధ్వర్యమున (స్వాతంత్ర్యవారసందర్భంలో) సభలు జరుపుచూ విద్యార్థి ఐక్యత కొరకు - కాంగ్రెసు నాయకుల విడుదలకొరకు - విశాఖపట్నంజిల్లా క్షామప్రజలకు సాయపడుటకు విద్యార్థులను సమీకరించుటకు నిర్ణయించడమైనది.

విద్యార్థుల మహాసభ

(4 వ పేజీ తరువాయి) కాపాడడానికి, విద్యార్థుల నెదుర్కొన్న అనేక సమస్యలను పరిష్కరించడానికి, కలసి పని చేద్దామని విద్యార్థులందరిని, ప్రత్యేకంగా పోటీసంఘాలను కోరుచున్నాము"

ఇవిగాక, కరువునుండి ప్రజలను కాపాడండని ఒకతీర్మానం, బీహారు రాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్‌పై, పశ్చిమ గోదావరిజిల్లా విద్యార్థి ఫెడరేషన్‌పై నిషేధాలను తొలగించాలని మరొకటి, బెంగాలుకరువులోనూ, తదితరసమస్యలపైనా అఖిలభారత విద్యార్థి ఫెడరేషన్‌తో కలిసిపనిచేసిన పంజాబు, బెంగాలు ముస్లిం విద్యార్థి ఫెడరేషన్లను అభినందిస్తూ మరొక తీర్మానం; భాషేతర విషయాలన్నీ మాతృభాషలోనే చెప్పాలనీ; బి. ఎన్. రావు కమిటీ బిల్లు అభివృద్ధికరమైనదనీ; స్టేట్సులోవున్న నిర్బంధ విధానాన్ని ఖండిస్తూ తీర్మానాలు చేయబడ్డాయి. ఫాసిజాన్ని నాశనంచేయడంలో ప్రపంచయువకులను అభినందిస్తూ మరియొక తీర్మానం చేయబడింది. ఇవిగాక, వివిధ విశ్వవిద్యాలయాలలోని ప్రత్యేక సమస్యలపై మరికొన్ని తీర్మానాలు ప్యాసుచేయబడ్డాయి.

ప్రజాయుద్ధం: విద్యార్థి ఫెడరేషను

అఖిలభారత విద్యార్థి ఫెడరేషన్ యీ యుద్ధాన్ని ప్రజాయుద్ధమని పిలుస్తోంది కాబట్టి ఐక్యవిద్యార్థి ఉద్యమ నిర్మాణాన్ని కొంతమంది వ్యతిరేకించుతున్నారు. ప్రజాయుద్ధమనే మాటనే సాకుగా తీసుకొని విద్యార్థుల శ్రేయస్సుకొఱకు, విద్యార్థుల కష్టనివారణ కొఱకు కృషిచేయుటకునిరాకరించుతున్నారు. కాన ప్రజాయుద్ధమనేమాటే విద్యార్థి ఐక్యతకు అడ్డుగావున్నది కాన, అఖిలభారత విద్యార్థి మహాసభ విద్యార్థుల ఐక్యతను నిర్మించుటకు యుద్ధస్వభావాన్ని నిర్వచించమని పిలుపు యిచ్చింది. అన్ని రాజకీయ దృక్పథాలుగల విద్యార్థుల నందరిని ఐక్యపర్చడమే విద్యార్థి ఫెడరేషన్ ముఖ్యఆశయం కాబట్టి, యీ యుద్ధాన్ని ఏ విధంగాను నిర్వచించడంలేదు. కమ్యూనిస్టు విద్యార్థులు విద్యార్థుల ఐక్యతనే దృష్టిలోపెట్టుకొని యీ నిర్ణయాన్ని అంగీకరించారు. తాము వ్యక్తిగతంగా యీ యుద్ధాన్ని ప్రజాయుద్ధమని నమ్ముతున్నామని స్పష్టపర్చారు. కాన విద్యార్థులందరుకూడా విద్యార్థి ఫెడరేషన్‌లోచేరి విద్యార్థిఉద్యమాన్ని, జాతీయోద్యమాన్ని బలపర్చమని విజ్ఞప్తి జేశారు.

అధ్యక్షులు సభను ముగిస్తూ యిలాఉపన్యసించారు: "మీరే దేశాన్ని విముక్తిచేసేది. మీ రాజకీయ తీర్మానంచూస్తే దీనిని ఎవరైనా వ్యతిరేకిస్తారా? అనిపిస్తోంది. ఇది విద్యార్థులను ఐక్యపర్చడానికి ఎంతేని తోడ్పడుతుంది. విద్యావిధానంపైన మీరు చేసిన నిర్ణయాలు చూస్తే నాకు చాలా ఆశ్చర్యం కల్గింది. విద్యావిధానాన్ని నాశనం కాకుండా కాపాడగల్గేది మీరే. నేను అనేక ఉపన్యాసాలు విన్నాను. కాని మీ ఉపన్యాసాలు విన్నాక మీలోవున్న దీక్షను, విషయ పరిజ్ఞానాన్ని చూస్తే మీకెవ్వరా సాటి! అని అనిపించింది. మీలోవున్న చీలికలు పోగొట్టుకొని, ఐక్యవిద్యార్థి ఉద్యమానికి పునాదులు వేయించాలని నేనిక్కడికి వచ్చాను. ఈనాకోర్కెను మీరు సఫలీకృతం చేశారు. ఇదే నా అంతిమ సందేశం."

నూతన సంవత్సరానికి సత్యపాల్ డాంగ్ ప్రధాన కార్యదర్శిగాను, అరుణ్‌బోసు, పరమేశ్వరన్, హరీష్ తివారీ, రామెన్ బెనర్జీ, వినాయి గంగూలీ సహాయ కార్యదర్శులుగాను ఎన్నుకోబడ్డారు.

స్వాతంత్ర్యసమరంలో స్త్రీలు తమ పాత్రను నిర్వహించాలి

బాపట్లతాలూకా మహిళామహాసభలో ఉపన్యాసాలు

బాపట్ల తాలూకా ప్రథమ మహిళానభ వచ్చలతాడిప్రులో జనవరి 3 వ తేదీన వైభవోపేతంగా జరిగింది. మహిళామణు లంతా నూతన చైతన్యంతో, ఉదాత్తమైన జాతీయ భావాలతో అకలంకమైన దీక్ష తత్ప రతతో తమ స్వత్వాలను రక్షించుకోడానికి కంకణం కట్టారు. జిల్లాలోని ప్రధాన కేంద్రాల నుంచి తమ సోదరీమణులకు సుహృద్భావ సందేశా లందజేయడానికి మహాసభకు హాజ రైనారు.

ఉషఃకాలానికే తమ సోదరీమణులను ఆహ్వానింపుటకా అన్నట్లు, వచ్చలతాడిప్రు స్త్రీలు తమతమ గృహప్రాంగణాలను స్వాతం త్ర్య పతాకాలు, ఉత్తేజమైన పవిత్ర నినాదా లతో కూడిన రకరకాలైన సంక్రాంతిముగ్గులు పొందికగాను, ముచ్చటగాను తీర్చిదిద్దారు.

శ్రీమతి అత్తిలి స్వరాజ్యలక్ష్మిగారు (బాపట్ల గరల్స్ ట్రెయినింగ్ ప్రధానోపా ధ్యాయురాలు) సభాధ్యక్షత వహించారు.

సాయంత్రం 3 గంటలకు "కస్తూరిబా సభామందిరం"లో ప్రారంభమైన సమా వేశానికి 10 గ్రామాలనుంచి 200 మంది వరకూ ప్రతినిధులు హాజరైనారు. వీరుగాక వచ్చలతాడిప్రులోనే 800 పైగా స్త్రీ-పురు షులు సభకు విచ్చేశారు.

జండా ప్రతిష్ఠాపన గావిస్తూ, శ్రీ కాళమూరి కోటమ్మగారు, "ఈ పతాకంక్రింద నిలబడి వివిధదేశాల స్త్రీలు సాహసిస్తు దురంతాలను వీరో చితంగా యెదుర్కొంటూ, సంఘంలో తమ స్వాతంత్ర్యాన్ని, గౌరవస్థానాన్ని సంపాదించు కుంటున్నారు: అదేరీతిగా మనం మనపతాకం క్రింద నిలబడి స్వాతంత్ర్య పోరాటాన్ని సాగిస్తూ, స్వాతంత్ర్య, అభ్యుదయ, కాంతు లను స్థాపించాలంటూ ఉపన్యసించారు.

డా. కొమర్రాజు అచ్చమాంబగారు సభకు ప్రారంభోత్సవం గావిస్తూ, స్త్రీల అజ్ఞానానికి వేరుపురుగులైన మూఢనమ్మకాలను పార ద్రోలాలనీ, ఘోషా పద్ధతికి సత్వరంగా స్వస్తి చెప్పాలనీ, స్త్రీలు విద్యనభ్యసించి, ధైర్యస్థయిర్యాలతో తమఆస్తి వగైరా హక్కు లకై యెడతెగని కృషిచేయాలనీ, స్వాతంత్ర్య సమరంలో స్త్రీలు తమపాత్ర నిర్వహించాలనీ, పురుషులు తమతోపాటు స్త్రీలను కలుపుకుని, అభివృద్ధిలోనికి తీసుకురావాలనీ ఉద్ఘాటించారు.

అధ్యక్షురాలు తమ ఉపన్యాసంలో మహిళా సంఘాలపైన నీతిమాలిన దుష్ప్రచారం సాగి స్తున్న వ్యక్తులకు సమ్మెటపెట్టులవంటి సమా ధానాలిస్తూ, తమ ఉపన్యాసాన్ని యిలా ముగించారు: "ఇవి కమ్యూనిస్టుల మహిళా సంఘాలని మనల్ని మసిపూయజూస్తున్నారు. అది శుద్ధ అబద్ధం. కమ్యూనిస్టు మహిళలు మనసంఘాలలో పనిచేస్తున్నమాట వాస్త వమే, కాని అంతమాత్రంచేత యిది కమ్యూ నిస్టు మహిళాసంఘం కానేరదు. నేను కమ్యూ నిస్టునుకాను. నాలాగే భిన్నాభిప్రాయాలు గలిగిన స్త్రీలు అనేకులు యిందులో పాల్గొం టున్నారు."

శ్రీమతి మోటూరు ఉదయంగారు తాలూకా రిపోర్టును నివేదిస్తూ, మహిళా ఉద్యమం గ్రామగ్రామాన వ్యాపించిందనీ, 8 గ్రామాల్లో 800 సభ్యులున్నారనీ, శిక్షణ శిబిరాలు, పఠన కేంద్రాలు స్థాపించబడ్డాయనీ, 4 గ్రామాల్లో మరుగుదొడ్లు యేర్పరచబడ్డాయనీ, బెంగాలు రాయలసీమ, విశాఖ కరువు బాధితులకు విరాళాలు పంపబడ్డాయనీ మొదలైన కృషిని ఉదహరిస్తూ ఉపన్యసించారు.

తీర్మానాలు

చీమూరు, అస్తి బిల్లులను రద్దుచేయా లని ప్రభుత్వాన్ని కోరుతూ ఒక తీర్మానం గావింపబడ్డది. మరొక తీర్మానంలో ఘోషాను విసర్జించి, సరికొత్తలతో పాల్గొంటూ ప్రజా సంఘాలకు విరాళాలిస్తున్న కృష్ణాజిల్లా మహి ళలను అభినందించారు. నాగార్జున కొండ వద్ద కేంద్రమ్యూజియం స్థాపించే విషయంలో స్త్రీలు ఆందోళన గావించాలనీ, హిందూలా సవరణ బిల్లును త్వరలో అమలుపర్చేటట్లు చేయడానికి ప్రభుత్వం పైన ఒత్తిడితేవాలనీ; త్వరలో ప్రభుత్వం నాయకుల విడుదల చేయా లనీ, గాంధీ జిన్నాలు తిరిగి సమావేశమవా లనీ, స్త్రీలు గృహనిర్వహణలో పొదుపుగా వస్తువులువాడుతూ, కూరగాయలను, కోళ్ళను పెంచాలనీ తీర్మానించారు.

పోటీలు

తర్వాత బిడ్డల పోటీలు, సంగీత పోటీలు జరిగాయి. 6 నెలల ప్రాయం గలిగి, 16 పౌన్ల తూకం గల వాసదేవి (తాడిపర్రు) అనే బాలిక ప్రథమ బహుమతి పొందింది. తన కిన్నెర స్వరంతో మృదుమధుర గానం చేసి శ్రోతల హృదయాలను ఆనందపరవ శంలో ముంచెత్తిన విమలాదేవి (తాడిపర్రు) అనే ముద్దుబాలిక ప్రథమ బహుమతి సంపా దించింది.

పసిబాలుర కేరింతలతో, తల్లుల చిరు నవ్వులతో, వీటన్నిటిపై మించిన జయజయ ధ్వానాలతో సభముగిసింది.

ఆరాత్రి జరిగిన వైజ్ఞానిక ప్రదర్శనాలకు 3500 మంది ప్రజలు హాజరైనారు. "కష్టజీవి" బుర్రకథ, లంబాడీ డ్యాన్సు పూర్తి అయిన తర్వాత "నాటు మంత్రసాని" నాటకం ప్రద ర్శించ బడింది.

"సోవియట్ విజయం విశ్వమానవకోటికి స్వాతంత్ర్యాన్నిస్తుంది"

సరిహద్దురాష్ట్ర మాజీ కాంగ్రెసు ప్రధాని డాక్టర్ ఖాన్‌సాహెబ్ లాహోరునుంచి పెషా వర్ కు ప్రయాణమయే ముందు యిలా ప్రక టించారు:

"సోవియట్ విజయం బ్రిటిష్ సామ్రాజ్య వాదాన్ని బలపరుస్తుందని జాతీయవాదుల మనుకొనే కొందరు భ్రమపడుతున్నారు. ఈ విషయం నాకు ఆశ్చర్యం కలుగజేస్తోంది, కాని యదార్థాన్ని గుర్తించే ప్రతి భారతీయుడు సోవియట్ విజయం విశ్వమానవకోటికి కాంతి స్వాతంత్ర్యాలను ప్రసాదిస్తుందనే విషయం వెంటనే గ్రహించగలడు. బ్రిటిష్ సామ్రాజ్య వాదులు యీ ఘటనను చూచి భయభ్రాంతు లవుతున్నారు."

గ్రీస్ పరిస్థితులను గురించి మాటాడుతూ "గ్రీస్ వ్యవహారాల్లో బ్రిటిష్ సామ్రాజ్య వాదులుచేస్తున్న కుట్రలు స్వాతంత్ర్య కాముకు లైన ప్రపంచప్రజల కండ్లు తెరుస్తున్నాయి. ప్రజా స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదులు యికపైన జోక్యం పుచ్చుకోడానికి వీలుండదు." అని అన్నారు.

★ ఫిలిం రెవ్యూ

"తాసిల్దార్" ఫిలిం కాలవాహినికి యెదురీత

వస్తోంది, వస్తోంది ఒక కొత్త తెనుగు ఫిల్ము అని ఎదురుచూచారు ఆంధ్రులంతా. వచ్చింది "తాసీల్దార్". హాల్లోకి వెళ్ళి అరగంట చూచేసరికే అసలురంగంతా బయట పడ్డది. సనాతన సాంప్రదాయం పేరుతో సమస్త ఛాందసాన్ని కొనియాడింది. నవ్య తను హేయంగా చిత్రించింది.

ఊళ్ళోకల్లా లోకువ ఎవడురా అంటే, "నంబి కొండాయి" అన్నట్లు, హుస్సుని లేవ లేని ప్రతిమగాడికి లోకువ అనుది। తరతరా లుగ దాడిచేస్తున్న మహిళాలోకంమీదనే "తాసీల్దార్" కూడా విరుచుకుపడింది.

హాలులోనే బయలుదేరాయి గుసగుసలు, అనేక వింతవింత చర్చలు. "భలేబాగుంది! ఏమి నడమంత్రం కాలమండి! మీటింగులు! మహిళాసంఘాలు! వెధవలపెళ్ళిళ్ళు! అస్తి హక్కులట! అంతా తూర్పారపట్టేశాడండి" అంటున్నా డొక ఛాందస బ్రాహ్మడు. "అదేమ్మాట లెండి. అంతఃపురాల్లో మూత వేసి అణిచిఉంచినా, అశ్లీల వర్తనలయిన స్త్రీలూ ఉన్నారు: బహిరంగంగా తిరిగి ప్రజ అలో సేవచేసే ఉత్తమ పతివ్రతలూ ఉన్నారు. కాస్త తలయెత్తిన ప్రతి స్త్రీకి పేర్లుపెట్టడం, అశ్లీలత అంటగట్టడం, దాన్ని ఫిల్మురి కెక్కించడం ఏమంత సభ్యతగాదులెండి!" అంటున్నాడు మరొక యువకుడు ప్రక్కన కూర్చొని. ప్రజాప్రభుత్వమే ఉంటే, యీ ఫిల్మును నిషేధించి ఉండేవాళ్ళముగదా అని పించింది నాకు. స్త్రీల గ్యాలరీవైపుకుచూస్తే, వారి ముఖాల్లో ఏదో ఆందోళన, అశాంతి అగుపించింది. బహుశా ఆడువారి అజ్ఞానాన్ని జోలపాడి, ఆధునిక నాగరకతనంతా అప హేళన చేస్తున్నాడనేమో! "ఆడుది తిరిగి చెడుతుంది. మగవాడు తిరక్క చెడుతాడు" అనే వేదాంతవర్గమంతా వికటంగా వెర్రి నవ్వులు విసురుతున్నారు.

అసలుసమస్యకువస్తాను. "తాసీల్దార్" కథావస్తువంతా పనికిమాలిన చెత్త. నిజం మాట్లాడవలసివస్తే యిది పక కథగాదు: కళాగాదు. దీనిలో నాయిక ఎవరో, నాయకు డెవరో అర్థంకాదు. ఒక ఉన్నత ఆశయమూ లేదు; ఉత్తమ లక్ష్యమూలేదు.

రజనిపాత్రను విమర్శించిచూదాం. రజని పాశ్చాత్యవిద్య నేర్చిన ఒకయువతి, సమా జంలో మెలగనేర్చిన సామర్థ్యం ఉంది. మహిళాభ్యున్నతి వాంఛిస్తుంది. స్వాతంత్రం, సమానత్వం కోరుతుంది. రాజకీయజ్ఞానం గలది. ఎన్నాళ్ళో గురువుగాను, స్నేహితుడు గాను నటించి, తనను మోసంచేసిన కామేశం యొక్క దేశద్రోహం, పందమాంగదల చర్యలను గర్హిస్తుంది. అమితావేశంతో ఎదు ర్కొంటుంది. తుదకా దుష్టునిచేతిలో గుర ణిస్తుంది. ఈమెను "తాసీల్దార్" ఫిల్ము నిర్మాత లెలా ప్రదర్శించారు? స్వాతంత్ర్యం పేరిట, స్వేచ్ఛా ప్రవృత్తి నంటగట్టారు. తాసీల్దార్‌ను తగులుకు పోయిందన్నారు. అధికార గర్వంతో నౌకర్లపై అసహ్యమైన గయ్యాళితనం చేయించారు. సవతితో పోరు, అతి లోలత్వంతో, దుబారాఖర్చులతో దివాలా తీయించడం. ఇంకా ఆమె సౌశీల్యం ఏమూలైనా కొంచంమిగిలిపోతుందా, అన్నట్లు దొంగవ్యాపారయిన బట్టలవర్తకునిచే "మాకు ఇది కంట్రోలు, ఇది కంట్రోలు, మీకే కంట్రోలు లేదుగదండీ!" అనిపించి పూర్తిచేశారు. చదువుకొన్న, సభ్యతనెరిగిన సమాజంలో తిరుగనేర్చిన, ఒక మహిళా సేవకురాల్ని, ఒక పతితగా, అశ్లీలగా, అహం యిత్యపు పొగరుబోతుగా, వేశ్యకుమించిన వేశ్యగా చిత్రించడమే "తహసీల్దార్" ఫిల్ము ప్రధానోద్దేశ్యం.

పోనీ నవ్యతపేరిటా, స్వాతంత్ర్యం పేరిటా బయలుదేరి వక్రమార్గానబడ్డ ఒక యువతి జీవితాన్ని విమర్శించి, దిద్ది మహిళాలోకాని కింత అభ్యుదయమార్గాన్ని సూచించారా అంటే, అదీ సున్నే. ఏ ప్రపంచం మొఖమూ ఎరగ కుండా, వంటయింటిలో పొగచూరిపోతూ, నోములు, తులసిపూజలతో కాలంగడిపే పురాతనపు ఇల్లాలిని రజనికి పోటీపెట్టి, అని దకు విజయజోహారులిచ్చారు. తుదకు స్త్రీలు సభలకు హాజరవడాన్నికూడ అసహ్యంగా పరిహసించారు. భర్తలంతా తమ పిల్లల నెత్తుకొని, నెత్తి నోరు కొట్టుకొంటూ, మహిళాసభవద్దకు వెళ్ళేలాచిత్రించారు. పోనీ, పూర్వ సాంప్రదాయాలకు పూజలు చేసే వీధి హరికథలకు, వీధిభాగవతాలకు, పురాణ కాలక్షేపణలకు వెళ్ళేటప్పుడు పిల్లలను ఏం చేసేవారో తెలియదా? స్త్రీలు చెప్పులు తొడు క్కోవడంగూడ అపహాస్యం చేయాలా? పురుషులతో స్నేహపూర్వకమైన, గౌరవ చిహ్నమైన కరస్పర్శే మహాపాపమను కొనే ఛాందస దురభిప్రాయానికే విజయ దుందుభులు కొట్టించాలా? అవును, కామెర్ల రోగికి ప్రపంచమంతా పచ్చగానే కన్పడు తుంది!

లక్షల, కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి ఫిల్ములు తీస్తున్నారు. అమూల్యమైనకాలాన్ని వినియోగించి వ్యయప్రయాసలుపడి ప్రజలు చూస్తున్నారు. డబ్బు ఎంత ప్రధానలక్ష్యమైనా, ప్రజల కింత మంచినిచెప్పే ఫిల్ములు తీయించ డానికి నోచుకోలేదా? "తాసీల్దార్" లాంటి ఫిల్ములే ఆంధ్ర ప్రజలకు గతియా? నేటి సమాజంలోని స్త్రీ అధోగతిని దాచిపెట్టి "అమ్మా, నీవే ఆదర్శమూర్తివి" అని చెప్పే మోసపుమాటలు ఇంకెంత కాలం? ఈ "తాసీల్దార్" ఫిల్ము, కాలప్రవాహానికి ఎదురీత. జాతీయ, దేశీయ, సమకాల సాంప్రదాయాలకు విరుద్ధం. ఏ మహిళా ఉద్య మం సరోజినీ, విజయలక్ష్మీపండిట్ లాంటి పునీతలచే నిర్మింపబడ్డదో, దానిలో వేశ్యా మూర్తిని చూపిస్తోంది. నవీన నాగరకతలో ఉత్కృష్టతనుచూడలేక, (మిగతా 10 వ పేజీ)

★ రాయలసీమలో

ప్రాజెక్టు రైతుమహాసభలు

రాజంపేట తాలూకా ప్రథమ రైతు మహాసభ జనవరి 1, 2 తేదీలలో రాజంపేటలో శ్రీ పంజం పట్టాభిరామరెడ్డి గారి అధ్యక్షతను జరిగింది. ఆహ్వానసంఘా ధ్యక్షులైన శ్రీ గుత్తా వెంకటరామానాయుడు గారు ప్రతినిధులను, ప్రేక్షకులను ఆహ్వా నిస్తూ, నేడు అధికాహారోత్పత్తి రైతుల దేశ భక్తియుతమైన కర్తవ్యమని, ఆపవిత్ర బాధ్య తను రైతులందరూ నిర్వర్తించాలని ఉద్బో ధించారు. శ్రీ ముక్కామల నాగభూషణం గారు తమ ప్రారంభోపన్యాసంలో మానవునికి నీరు యెంత అవసరమో పైర్లకుగూడా నీరు అంత అవసరమనీ, వ్యవసాయాన్ని అభివృద్ధి కరమైన నూతన విధానాలతో కొనసాగించా లనీ, రాయలసీమ భూములకు నీరుసమృద్ధిగా ఉంటే చాలా సారవంతమైనవి కాగలవనీ, అన్నారు. శ్రీ పట్టాభిరామిరెడ్డిగారు తమ అధ్యక్షోపన్యాసంలో రైతు సంఘాలలో యేఒక్క రాజకీయపార్టీయొక్క విధానాన్ని రుద్దకూడదని, కాని అన్ని రాజకీయ పార్టీ లకు రైతుసంఘాలలో స్థానం వుందని అన్నారు.

కేంద్రప్రభుత్వపు పల పరిశోధనాలయాన్ని ప్రస్తుతమున్న కోడూరులోనే శాశ్వతంగా ఉంచాలనీ, పండ్లకానింగు ఫ్యాక్టరీని పరిశోధ నకు నిర్మించాలనికోరుతూ తీర్మానింపబడింది.

చెయ్యేటికి పాదినగడ్డవద్ద ప్రాజక్టు నిర్మించితే తాలూకాలో సుమారు 25 వేల యకరాలు మాగాణిసాగు అవుతుందని, ఇది జిల్లాలో ఆహారసమస్యా పరిష్కారానికి చాలా వరకు తోడ్పడుతుందని, కావున ప్రభు త్వమువారు వెంటనే ఆప్రాజక్టును నిర్మించా లని తీర్మానించారు. ప్రభుత్వం ఆహారపదా ర్థాలను ఆదనపు ప్రాంతాలలో కంట్రోలు రేట్లకు కొని, తరుగుప్రాంతాలలో నిల్వచేసి కంట్రోలు రేట్లకే అచ్చటి ప్రజలకు అమ్మా లని తీర్మానించారు. తాలూకాలో పశువుల జబ్బులు అధికముగా ఉన్నందున వెంటనే ఒక సంచారపు పశువుల డాక్టరును అదనంగా నియమించాలన్నారు. ఎరువులు తాలూకాలో నాలుగు కేంద్రాలలో నిల్వచేసి అమ్మాల న్నారు. అధికాహారోత్పత్తికిగాను మైనరు ఇర్రిగేషను పనులు నిర్మించాలన్నారు. పై తీర్మానాలను అమలులోనికి తెచ్చేందుకు, ప్రభుతముతో రాయబారము నడుపుటకు ముగ్గురు సభ్యులుగల ఒక కమిటీని ఎన్ను కున్నారు.

★

నందికొట్కూరు తాలూకా ప్రాజెక్టుల మహాసభ 2-1-1945 తేదీన ఆత్మకూరు గ్రామములో సంతగేటునందు జరుపబడెను. తాలూకాయందలి వివిధగ్రామములలో నూతన ప్రాజెక్టుల నిర్మాణమును గురించి, చెరువుల నిర్మాణమును గురించి వివరాలను ప్రోగుచేసి తాలూకా రైతుసంఘం 15 రోజులకుముందు నుండి 500 కరపత్రములతో మహాసత్తై తీవ్రమైన ప్రచారము చేసింది. సభకు 15 గ్రామాలనుండి 1500 మంది ప్రజలకు పైగా ప్రజలు హాజరయ్యారు. వారిలో 600 మంది ముస్లిం రైతాంగము.

సభను ప్రారంభిస్తూ శ్రీ గాడిచర్ల హరి సర్వోత్తమరావుగారు తాలూకాలో చాల కాలముక్రింద తలపెట్టబడి వదలివేయబడిన వెలుగోడు ప్రాజెక్టునుగురించి, సంగమేశ్వర ప్రాజెక్టును గురించి, కర్నూలు - కడప కాల్వ మరమ్మతుల ఆవసరమును గురించి, ఉపన్యసించిరి. కర్నూలు-కడప కాల్వక్రింది రైతులు పొరపాటు దృక్పథముతో వరిపంట సాగుచేయుటలేదనీ, ఇపుడు పండిస్తున్న మెట్టపైరుకంటె, సరియైన పద్ధతులు అవలం బిస్తే వరిపంటవలననే ఎక్కువ లాభం వస్తుందనీ, రైతులు ధైర్యంగా వరిపంటను సాగుచేయుటకు ముందుకు రావలయుననీ, తెల్పుతూ నూతన ప్రాజెక్టుల నిర్మాణమునకు రైతులు తీవ్రమైన ఆందోళన సాగించ వలసిందని కోరారు.

శ్రీయుత కాట్రగడ్డ నారాయణరావుగారు తమ అధ్యక్షోపన్యాసములో, ఉత్తరసర్కారు లందు నూతన ప్రాజెక్టుల నిర్మాణానికి రైతు సంఘాలు చేస్తున్న ఆందోళనను గురించి చెప్పుచూ, రైతుల నెదుర్కొన్న ప్రతి సమ స్యలోను రైతుసంఘాలు ఎలా చొరవతో పని చేసి బలమైన ప్రజాసంస్థలుగా తయారవు తున్నాయో, అలాగే వెనుకబడిన రాయలసీమ జిల్లాలలోకూడ బీదరైతులు రైతుసంఘాలలో చేరిఆందోళన ప్రారంభించిన రోజే ప్రభుత్వం కళ్లు తెరుస్తుందని ఉద్బోధించిరి.

తర్మాత శ్రీయుత కె. స్వామిరెడ్డిగారు (ఇదివరలో ఏర్పడిన జిల్లా కాంగ్రెసుకమిటీ సెక్రటరీ) సంగమేశ్వరము, వెలుగోడుమొద లైన 12 ప్రాజెక్టులు, చెరువుల మరమ్మతులు సూచిస్తూ, వాటిని ప్రభుత్వం వెంటనే ప్రారం భించవలెనని కోరుతూ తీర్మానము ప్రతిపా దించగా అది ఏకగ్రీవంగా ఆమోదించబడింది.

ఆంధ్రరాష్ట్ర ఈనాం రైతురక్షణ కమిటీ ఈనాం రైతుల హక్కులను రక్షించుటకు మద్రాసు ప్రభుత్వమునకు సూచించిన సవర ణలను చట్టంగా ప్రకటించ వలయునని ప్రభు త్వమును కోరుతూ తీర్మానించబడెను.

దేశములోని రాజకీయని స్తబ్ధతను తొలగిం చుటకు, కాంగ్రెసు-లీగు ఐక్యతను నిర్మించు టకు, గాంధీ - జిన్నాలు తిరిగి సమావేశము కావలయు నని తీర్మానించబడెను.

విశాఖ రేషనింగు స్కీములో మార్పులు జరగాలి

కణితిఫిర్కా ధాన్యం ఉత్పత్తిదారుల సభలో తీర్మానాలు

ది 26-12-44 న విశాఖపట్టణం తాలూకా కణితి ఫిర్కా ధాన్యం ఉత్పత్తిదారుల సభ గాజువాక గ్రామంలో శ్రీ ముళ్ళపూడి వీర భద్రంగారి అధ్యక్షతను జరిగింది. ఆ సభలో ఈ క్రింది తీర్మానములు ఏకగ్రీవంగా ఆమో దించబడినవి.

1. ప్రభుత్వము ప్రవేశపెట్టబోవు రేష నింగు పద్ధతివలన ప్రజలందరికి సక్రమంగా ఆహార దినుసులు సప్లయికాబడును గనుక, రైతుల అవసరాలు పోను మిగిలిన ధాన్యాదు లను సేకరించే ప్రభుత్వ విధానమును ఈసభ వారు ఆమోదించుచున్నారు. కాని రైతుకు రోజుకు మిగుల్చు 1 సేరు ధాన్యంగాని, ½ సేరు గంటెలు లేక చోళ్లుగాని సరిపోవు. కష్టపడి పనిచేయు రైతులు రోజుకు మూడు సార్లు తింటారు. అదీగాక, చోళ్ళు, గంటెలు దంపి బాగుచేసిన తరువాత తరుగు వచ్చును. దానిని కూడ ప్రభుత్వం గుర్తించి, రోజుకు పెద్ద వారికి 18 కవీసం 1½ సేర్లు ధాన్యంగాని, 1 సేరు గంటెలుగాని, చోళ్ళుగాని రైతుకు మిగల్చవలెనని ఈ సభవారు ప్రభుత్వమును కోరుచున్నారు.

2. పశువులకు ధాన్యం, గంటెలు దానా వేయు అలవాటు కలదు. కాని ఆహారకొరత రోజులలో ధాన్యాదులు దానాగా వేయుట ప్రజల తిండికి మోసం గలుగుతుంది కనుక ఉలవలనే దానాగా పశువులకు వాడవలెనని ఈ సభవారు రైతులను కోరుచూ, చవక డిపోలద్వారా ఉలవలను రైతులకు సప్లయి చేయించవలసిందని ప్రభుత్వమును ఈ సభ వారు కోరుచున్నారు.

3. గ్రామోద్యోగులు కుప్పలమీదనే పం టను అంచనా వేయుచున్నారు. కాని నూర్చిన తరువాత పంట, ఆ అంచనాలకంటె తక్కువగాని ఎక్కువగాని వుండవచ్చును. కాన, నూర్చిన తరువాతనే అంచనావేసే పద్ధ తికి అవకాశం కలిగించవలెనని ఈ సభవారు కోరుచున్నారు.

4. గ్రామంలో అధికారులు ఎకరమునకు 1 మణుగు చొప్పున గంటెలు వసూలు చేయు చున్నారు. ఈ పద్ధతి ప్రభుత్వ విధానమునకు వ్యతిరేకమేకాక, అధికసంఖ్యాకులైన రైతు లకు నష్టదాయకము గాన, ఈపద్ధతిని వెంటనే రద్దుపరచుచు సరియైన పద్ధతులద్వారా ధాన్య సేకరణ చేయవలసిందని ప్రభుత్వమును ఈ సభవారు కోరుచున్నారు.

5. ప్రభుత్వ ఏజంట్లు (వర్తకులు) ధాన్యా దులను కొనునపుడు 90 తులముల సేరుతో కొలుచుకొనుచున్నారు. దీనివలన రైతుకు నష్టంవచ్చుటయేగాక, తరువాత కొనుక్కునే ప్రజలకు లాభముండదు. కావున వెంటనే 80 తులముల సేరు ప్రవేశపెట్టించవలెనని ప్రభు త్వమును ఈ సభవారు కోరుచున్నారు.

6. ధాన్యాదులు కొనునపుడు వర్తకులు రైతులకు రశీదులు యివ్వుటలేదు. కాన, దీని వలన అనవసరపు తగాదాలకు దారితీస్తుంది. కనుక రైతులకు రశీదులిప్పించుపద్ధతిని ప్రవేశ పెట్టించవలెనని ఈ సభవారు కోరుచున్నారు.

7. ధాన్యాదులను గ్రామాలలో నిలవచేసి, తిరిగి ధాన్యంగానే పంపకంచేయు ప్రభుత్వ విధానమును ఈ సభవారు ఆమోదిస్తూ, దీని వలన అనవసరమైన రవానా ఖర్చులు, మిల్లు ఖర్చులులేకుండా బీదప్రజలకు అందుబాటులో వుండేలా చూడవలెనని కోరుచున్నారు.

ఒంగోలు తాలూకాలో ఎరువులకు కరువు

ఒంగోలు తాలూకా రైతుసంఘ కార్యదర్శి ఎం. కేశవులుగారిలా ప్రకటిస్తున్నారు:

ఒంగోలుతాలూకాలో కొత్తపట్నం ఫిర్కా అంతా సముద్ర తీరపు యిసుకభూములే. అచ్చటి ప్రజలు రాగిపంటపై ఆధారపడి యున్నారు. యీపంట అమోనియా ఎరువు లేనిదే పండదు. గత సంవత్సరం అమో నియా చాలినంత సప్లయి కానందున యీ ప్రాంతం అంతా పంటలుపోయి, ప్రజలింత వరకు తిండిలేక నానాబాధలు పడుతున్నారు. "అగ్నికి వాయుదేవుడు తోడయినట్లు" మలేరియా, గజ్జి, దురద, రక్తవిరేచనాలు కూడా వారిని పొట్టబెట్టుకుంటున్నవి.

ఈసంవత్సరం కొంతవరకు అమోనియా సక్రమంగా సప్లయి అయినందున, ప్రజలు మలేరియాతో బాధపడుతున్నా కూడా, తమ భావిజీవితం బాగుపడుతుందని సంతోషిస్తు న్నారు. కాని యీ సమయంలోనే పిడుగు వంటి వార్త వినవలసివచ్చింది. అది ఏమి టంటే, అమోనియా ఎరువు రాగి పంటకు యివ్వకూడదట వ్యవసాయశాఖవారు; రాగిపంటకు ఎరువు యివ్వవద్దనీ, వరికి మాత్రమే యివ్వవలెననీ, వారికి పై అధికా రులనుండి హుకుంవచ్చిందట.

పై నిబంధనవల్ల యీ ప్రాంతపు రైతు లకు "మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లు" యింది. ఇందువల్ల అధికాహారోత్పత్తిని కుంటుపరుస్తోంది ప్రభుత్వం. ఈ తెలివి తక్కువ నిబంధనవల్ల యీ ప్రాంతపు ప్రజల్ని చేతులారా కరువురాక్షసికి బలి యివ్వడం అవుతుంది.

ఇంకా తెలివితక్కువతనం ఏమిటంటే, యీ ప్రాంతం అంతా అమ్మోనియామీద ఆధారపడే విషయం వ్యవసాయశాఖవారికి తెలిసియూ, ఒంగోలు తాలూకాలో యీసమ యంలో వరికంటెరాగికి ఎక్కువ అమోనియా కావాలనితెలిసియూ, ఒంగోలులో వ్యవసాయ శాఖవారివద్ద కావలసినంత అమోనియా ఉండియూ, ముఖ్యమైన రాగిపంటకు అమో నియా యివ్వకపోవడం గర్హనీయం.

★

డిమాన్‌స్ట్రేటరే దొంగవ్యాపారం చేస్తున్నాడు

ఆత్మకూరు ఎగ్రికల్చరల్ డిమాన్ స్ట్రేటరు ఇనపసామగ్రి అమ్మకంలో దొంగ వ్యాపారం చేస్తున్నాడు. డిశంబరు ఆఖరు వారంలో డిపోకు 63 జతల బండిపట్టాలూ, అంతకుముందు కొన్ని పారలు, పలుగులు, ఇనుమువచ్చాయి. అమ్మకం ప్రారంభమైంది. కాని, డిమాన్‌స్ట్రేటరు బండిపట్టాల జతకు తనబిల్లుపై రు 27 లు వ్రాసి, రు. 31 యిస్తే గాని యివ్వనన్నాడు. ప్రభుత్వమిచ్చిన జీతం తింటూ, చట్టానికి వ్యతిరేకంగా ఎక్కువధర యిమ్మనీ, బిల్లు యివ్వననీ, చెప్పడం ఎంత దారుణమైన సంగతి! రైతులు డిమాన్ స్ట్రేటరుయొక్క అవినీతినిగూర్చి ప్రభుత్వానికి తెలియజేశారు. తాలూకా రైతుసంఘంవారు కలెక్టరుకు తంతినిచ్చారు. ప్రభుత్వం వెంటనే డిమాన్‌స్ట్రేటరుపై తగు చర్య తీసుకోవాలని కోరుతున్నాం.

వంకరటింకర మార్గాలు

(మొదటిపేజీ తరువాయి)

గాంధీ :—అంటే, మీరొకవైపు కాంగ్రెసు నాయకత్వం క్రింద పనిచేస్తామని అంగీకరిస్తూ, మరొకవైపు కాంగ్రెసుకు ప్రత్యామ్నాయంగా మరొక సంస్థను నెలకొల్ప చూస్తున్నారన్నమాట ఎప్పుడూ నేను త్రికరణశుద్ధిగా, తిన్నని మార్గాన, పోతాను. మీ వంకరటింకర మార్గాలు నా కర్థంకావు. కాంగ్రెసు బలీయమైన సంస్థగా అభివృద్ధి చెందినప్పుడు, మీ పంథావల్ల చిక్కులు తటస్థిస్తాయి. ఈనాడు మన లక్షలాది ప్రజాసామాన్యం కడుహీన స్థితిలో ఉన్నారు. ఏది కోరాలో, ఏది కోరకూడదో, తెలుసుకోలేని అమాయకులు వారు. వారిని పైకి తీసుకు రావడమెలాగ - అనే విషయమే నన్ను ఎక్కువగా కలవరపెడుతోంది. ఇట్టి పరిస్థితుల్లో వేరే మరొక సంస్థ ఉండడంవల్ల వారిలో గందరగోళం మరింత యెక్కువ అవుతుంది. అంతకంటె, కాంగ్రెసు నుండి వైదొలగడమే మంచిది.

రంగా :—మేం కాంగ్రెసులోనే ఉంటాం. కాని, అధికార పదవులకు ప్రయత్నించం. మీరు అహమ్మదాబాద్ కార్మికసంఘాని కిస్తూన్న స్థానమైనా మాకీయరా ?

గాంధీ :—అయితే కానీయండి, ఉంచేనే గాని, యేవస్తువు రుచీ తెలియదు. మీరు ఏ దృక్పథంతో పనిచేస్తారో, దాన్నిబట్టి మీపనిని నిర్ణయిందాలి. వాళయాన్ని నేను వెల్లడించాను. దాన్ని తొలగించే బాధ్యతమీది. అహమ్మదాబాద్ కార్మికసంఘం మాదిరిగానే మీరుకూడ మీసంస్థను తయారుచెయ్యండి. ఆ సంఘంలో సభ్యుడుగానున్న ప్రతివ్యక్తి కాంగ్రెసులోకూడా సభ్యుడుగా ఉంటాడు. కాంగ్రెసు శిక్షణకులోబడి ఉంటాడు. ఐనా, కాంగ్రెసులోను మ్యునిసిపాలిటీలోను, వారిబలం ఇంతా, అంతా అనడానికి వీల్లేదు. ఆంధ్రరాష్ట్రంలో మాత్రమే మీ రీ పనికి పూనుకోండి. రైతులందరూ మీ రిజిస్టరులో సభ్యులై తీరాలి. అయితే, సభ్యుల్ని చేర్పించడంలో ఉద్దేశం, వారికి చక్కని శిక్షణయివ్వడం, వారిలో కాంగ్రెసుభావాలు కలిగించడం, రాజకీయంగా వారిలో చైతన్యాన్ని కలుగజేయడం - అయి వుండాలి.

రంగా :— కాంగ్రెసువాదులకు మీరిచ్చిన కొత్తసలహాల్లో, రైతుసంఘాల నిర్మాణం కూడ ఒకభాగంకాదంటారా ? రైతుసంఘాలు స్థానిక కాంగ్రెసుకమిటీలతోను, కాంగ్రెసు నాయకులతోను, స్నేహసంబంధాలు కలిగియుంటూ, రైతుల్లోనుంచే నాయకులు తయారుకావడం, రైతులే సంఘీభావంతో తమ సమస్యలను పరిష్కరించుకోవడం, వాంఛింపదగిన విషయమేకదా ! రైతులు తమ వర్గసంస్థలలో సభ్యులుగా చేరేహక్కు హరిపుర కాంగ్రెసు అంగీకరించింది. కాని, ఈనాలుగుసంవత్సరాల అనుభవాన్నిబట్టిచూస్తే కాంగ్రెసువాదులు ముందు కొచ్చి, రైతు సంఘాల నిర్మాణానికి పూనుకోవడంమంచిదని అభిప్రాయపడుతున్నాం. అప్పుడే రైతుసంఘాలకూ-కాంగ్రెసుకమిటీలకూ మధ్య నిజమైన సామరస్యం యేర్పడుతుంది.

గాంధీ :—రైతు సంఘాలూ, కాంగ్రెసు సంఘాలూ, నా దృష్టిలో పర్యాయపదాలు. నిజమైన ప్రతి కాంగ్రెసుసంఘం రైతు సంఘంగా పనిచేయాలి; లేదా అట్టిసంఘాన్ని రద్దుచేసుకోవాలి.

రంగాగారు రెండవసారి గాంధీజీని కలుసుకున్నప్పుడు, రైతుసంఘాల నిర్మాణాన్ని గురించి, వాటికి-కాంగ్రెసుకూ మధ్య ఉండవలసిన సంబంధాన్నిగురించీ, రెండు సూచనలు చేశారు. వాటిలో దేన్నైనా అంగీకరించమని కోరారు. అవి యేమంటే :

1. కొత్తగా స్థాపించబడు రాష్ట్ర, జిల్లా, తాలూకా, గ్రామ కిసాన్‌కౌన్సిళ్ళలో మూడవ వంతు సభ్యత్వం ఆరాష్ట్ర లేక జిల్లా లేక తాలూకా, లేక గ్రామ, కాంగ్రెసుకమిటీల కుండాలి. ఈ విధంగా రైతు సంఘాలకు కాంగ్రెసు సహకారం, కాంగ్రెసు సలహాలు లభిస్తాయి.

2. కాంగ్రెసులో సభ్యులుగా ఉన్నవారే రైతుసంఘాల్లో కూడా సభ్యులై వుండాలి. ఇప్పటి కాంగ్రెసు నిబంధనావళి ప్రకారం కాంగ్రెసు కమిటీల నెన్నుకొను పల్లెటూరి వోటర్లే కిసాన్ కౌన్సిళ్ళనుకూడా ఎన్నుకుంటారు. అట్టి కిసాన్ కౌన్సిల్లు కాంగ్రెసు కమిటీలలో ఒక భాగంగా ఉంటాయి. రైతు సమస్యలపరిష్కారానికి మాత్రం అవి ప్రత్యేకంగా పనిచేస్తాయి. ఈ కిసాన్ కౌన్సిళ్ళలో కాంగ్రెసేతర సభ్యుల్ని కూడా కొందరిని చేర్చుకోవచ్చు : వారు కాంగ్రెసువ్యతిరేకులు కానివారై యుండాలి.

ఈ రెండు సూచనలలో మొదటిది తమకు అంగీకారయోగ్యంగా ఉంటుందని రంగాగారి అభిప్రాయం. ఇలాగే, రెండవ సూచన యందలి అఖరికోర్కెకూడా తమకుసంతృప్తికరంగా ఉంటుందని రంగాగారన్నారు.

గాంధీ:—కాని, వీటికి-క్రిందటిసారి మీరిచ్చెప్పిన అభిప్రాయాలకూ తేడాఉంది. కాంగ్రెసులో సభ్యులుకాని వారెవరూ రైతుసంఘాలలో సభ్యులుగా ఉండరని మీరు మొదట చెప్పారుగదా !

రంగా :—కాంగ్రెసును వ్యతిరేకించని కాంగ్రెసేతరులు మాత్రమే కొందరు మా సంస్థలో ఉండాలని కోరుతున్నాం. అనేక కారణాలవల్ల వారు కాంగ్రెసుసభ్యులుగా ఉండలేకపోవచ్చు.

గాంధీ :—మీకట్టి కోరిక యెందుకు కలగాలి ? కాంగ్రెసుకు వ్యతిరేకమైన యేవిషయంతోనూ మీకు ప్రసక్తిలేదని మీరే అంటున్నారుగదా : కాబట్టి, కాంగ్రెసుసభ్యులు మాత్రమే రైతుసంఘాల్లో సభ్యులుగా ఉంటే మంచిది. రైతులు జమీందార్లకు, షాహుకార్లకు వ్యతిరేకంగా తమ సమస్యలను పరిష్కరించుకోవలసివప్పుడు మాత్రం రైతుసంఘాలు ప్రత్యేకంగానే పనిచేస్తాయి. రాజకీయసమస్యలతో వాటికి సంబంధం ఉండదు. ఈవిధంగా, కిసాన్ కౌన్సిళ్లు రైతుల ప్రత్యేకసమస్యలపై పనిచేస్తూ, రాజకీయవిషయాలలో మాత్రం కాంగ్రెసునాయకత్వాన్ని అంగీకరించడం ఉత్తమం. కనుకనే, మీ మొదటి సూచనకు నేనెలాగో ఒప్పుకున్నాను. అప్పటికీ, నాలో సందేహాలున్నాయని స్పష్టంచేశాను. వాటిని తొలగించవలసిన బాధ్యత మీపై పెట్టాను. కాబట్టి, మీరు మీ మొదటిసూచనపైనే నిలబడండి.

రంగా :—ఒకేసారి రెండు సంస్థలలో సభ్యుల్ని చేర్పించడానికి కాంగ్రెసువాదులు భయపడుతూన్నట్లు మాకు బాధిగా తెలిసింది. కనుక రైతుసంఘం ప్రత్యేకసంస్థగా ఉండడమే మంచిదని నేను భావిస్తున్నాను. మా ప్రచారకులు కూడా యిట్టి పద్ధతికే అలవాటుపడ్డారు. రాజకీయాలకు సంబంధించినంతవరకు కాంగ్రెసు నాయకత్వాన్ని అంగీకరించేటట్లు నేను వారిని ఒప్పించాను. ఏటేటా కాంగ్రెసు కమిటీ ఎన్నికలు జరగ్గానే, పల్లెటూళ్లనుంచి ఎన్నుకోబడు ప్రతినిధులంతాకలిసి ఆయా ప్రదేశాన్నిబట్టి కిసాన్ కౌన్సిలుగా ఏర్పడతారు. ఈ కిసాన్ కౌన్సిలు రైతుల ప్రత్యేక సమస్యలను పరిష్కరిస్తుంది. రాజకీయ విషయాలలో మాత్రం కాంగ్రెసు నిర్ణయాలను శిరసావహిస్తుంది.

గాంధీ :— నా అభిప్రాయం ఏమంటే, మీరు మీ సొంతసంస్థను స్థాపించుకోండి. అందులో సభ్యులుగాచేరిన ప్రతి రైతు కాంగ్రెసులో కూడా సభ్యుడుగా ఉండేటట్లు చూడండి. రైతులకు సంబంధించినప్రత్యేక సమస్యలను (జమీందార్లు మొదలైనవారితో) మీ సంస్థ పరిష్కరిస్తుంది. రాజకీయ విషయాలపై మాత్రం కాంగ్రెసు సంస్థ నిర్ణయాలుచేస్తుంది.

రంగా: అలాఅయితే, కాంగ్రెసుసభ్యత్వ రుసుము నాలుగణాలలో నుంచి మేమొక అణా వంతున జమ కట్టుకోమని సెలవా ?

గాంధీ :—కాంగ్రెసు అంగీకరిస్తే, జమ కట్టుకోవచ్చు. దీని అర్థం, కాంగ్రెసు మీకు యీ అణా గ్రాట్యూయిటీగా (ప్రత్యుపకారంగా యిచ్చే సొమ్ము) యిస్తోందన్న మాట. నేనే కాంగ్రెసుయొక్క అధికార పదవిలో ఉంటే, తప్పక నేనందుకంగీకరిస్తాను.

రంగా:—అయితే, యిప్పటినుంచీ రైతుల్ని అణాసభ్యులుగా చేర్చుకోమంటారా ? అలా చేరిన వారందరూ, కాంగ్రెసుసంస్థ తిరిగి పని చేయ నారంభించిన వెంటనే, కాంగ్రెసు సభ్యులుగా పరిగణింప బడతారా ? లేక, యిప్పుడే ఒక్కొక్క రైతువద్ద ఐదేసి అణాలు వసూలుచేసి, కాంగ్రెసుకు నాలుగణాలు ప్రత్యేకించి ఉంచమంటారా ?

గాంధీ: — ఈరోజున మీరలా చేయరాదని నా అభిప్రాయం. చేస్తేబహిరంగంగానే చేయాలి; లేకపోతే చేయడం మానుకోవాలి. ముందే నాలుగణాల చొప్పున మీరు కాంగ్రెసు సభ్యత్వ రుసుం వసూలు చేయవద్దు. ఇంతకంటే నేనొక మంచిపద్ధతి చెబుతాను. శ్రీమతి రామాదేవికి కూడా యిదే సూచించాను. అది యేమంటే, ప్రస్తుతం మీరు ప్రచారకుల రిజిస్టరు మాత్రమే ఉంచండి. ఇప్పుడప్పుడే కాంగ్రెసు సభ్యుల్ని చేర్చవద్దు.

రంగా :—కాంగ్రెసు కార్యక్రమాన్ని అమల్లో పెట్టేటందుకొక కాంగ్రెసు సేవా సంఘం, ఒక కాంగ్రెసు ప్రచారకుల సంఘం, తాత్కాలికంగా నిర్మించుతాం. సాధారణకాంగ్రెసు సభ్యుల్ని మాత్రం యిప్పుడు చేర్పించం. ఇందులో అక్షేపణ యేమైనా ఉందా ?

గాంధీ :—లేదు. అలాగే చేయవచ్చును. కాని, మాది అహింసాయుత కార్యక్రమంతో కూడిన సంస్థ కాబట్టి, మీరన్న సంఘాలు రెండూ నిర్మాణకార్యక్రమంలో మాత్రమే నిమగ్నమై ఉండాలి. అలాచేస్తే, కమ్యూనిస్టులతో ఘర్షణకూడా రాదు. ఈరోజున మీరు అధికారంకోసం కాదు పనిచేసేది; కాంగ్రెసు సేవకులుగా మాత్రమే పనిచేస్తున్నారు. మీరు ఆర్భాటంలేకుండ, నిరాడంబరంగా పనిచేస్తూ, ఈకార్యక్రమాన్ని అమల్లో పెడితే, ఎవరూమిమ్మల్ని అడ్డుకోలేరు. మీతో కలిసి పనిచేయగోరేవారు తప్ప మరొకరెవరూ మీసంఘాలలో ప్రవేశించలేరు. వాక్చాతుర్యము, పత్రికా ప్రగల్భాల సహాయంతో ఎవరూ అక్కడ అధికార పదవుల్లోకి రాజాలరు.

రంగా :—కేవలం వాక్చాతుర్యంవల్ల ఉపయోగం ఉండదని నేనంగీకరిస్తాను. కాని, నిసలైన పనిచేస్తూ, ప్రదర్శించు వాక్చాతుర్యత వల్ల ప్రయోజనం ఉండదంటారా ?

గాంధీ :— నిసలైన పనిలోనే అంతా ఉంది. ఇక్కడి ఖాదీ విద్యాలయంలోను, హిందుస్థానీ తాలిమిసంఘంలోను, ఎంతమంది ఎడతెగకుండా పనిచేస్తున్నారో చూడండి ! పనిచేస్తూచేస్తూనే వారు ప్రాణాలు విడుస్తారా ! అనిపిస్తుంది. వారెవరూ ఉపన్యాసాలియ్యరు. పనిద్వారానే వారు గ్రామస్థులతో మాట్లాడగలుగుతున్నారు.

రంగా :—కమ్యూనిస్టులవిషయం చెప్పాలంటే, వారు కిసాన్ కార్యక్రమానికి సంబంధించినంతవరకు [illegible] కలుగజేస్తారు. [illegible] ప్రజల్లో వారికి [illegible] పోయింది. ఆంధ్రరాష్ట్రంలో నేడు రెండు రైతుసంఘాలు పనిచేస్తున్నాయి. ఒకటి కాంగ్రెసు రైతుసంఘం. మరొకటి కమ్యూనిస్టు రైతుసంఘం. మాకు సంబంధించినంతవరకు, కమ్యూనిస్టులెవరినీ మా సంస్థలో చేర్చుకోము.

గాంధీ:—నిబంధనలు చేసినంతమాత్రాన ఎవరినీ మీరు ప్రాథమికసభ్యులుగా రాకుండ చేయలేరు. నేను చెప్పినట్లు చేస్తే, మీరు చిక్కులులేకుండా చేసుకోవచ్చు.

గ్రీసులో యుద్ధవిరామం

చర్చిల్‌ప్రధాని తన తలబిరుసుతనం వదలి ప్రజాభిప్రాయానికి లొంగవలసి వచ్చింది. గ్రీసులో బ్రిటిషువేసాని దేశభక్తుల సైన్యాలతో తాత్కాలికసంధి చేసుకొన్నారు. 14 తేదీ ఆదివారం రాత్రితో రెండు సైన్యాలమధ్య పోరాటం ఆపివేశారు. బ్రిటిషు ప్రభుత్వం సంధిషరతులను ఆమోదించింది.

ఈ సంధిప్రకారం దేశభక్తులు ఏథెన్సు నగరంవదలి 100 మైళ్లు వెళ్లాలి. పెరాస్‌ద్వీపకల్పాన్నికూడ బ్రిటిషు సైన్యాలకు వదలివేశారు. తక్కిన గ్రీసుదేశమంతా దేశభక్తుల పరిపాలనక్రిందనే వుండటానికి బ్రిటిషువారు అంగీకరించారు. ఖైదీలుగా చిక్కిన బ్రిటిషు సైన్యాలను దేశభక్తులు విడుదలచేస్తారు. ఆదే సంఖ్యను ఖైదీలుగా చిక్కిన దేశభక్తసేనలను బ్రిటిషువాళ్లు విడుదలచేస్తారు. దేశభక్తుల తరపున ఎలాస్ నాయకులు, బ్రిటన్ తరపున జనరల్ స్కోబీ సంతకాలుచేశారు. దేశభక్తులు తాము అరెస్టుచేసిన పౌరస్తు అనుకూలురనుమాత్రం విడుదలచేయ నిరాకరించారు.

బ్రిటిషు ప్రజల ఒత్తిడివల్ల యీ సంధి జరిగింది. పాపం ! గ్రీసులోని రీజెంటు దెమాస్కినోస్, ప్రధాని ప్లాస్టిరాస్‌వంటి ప్రజావిరోధులకు యీ సంధి పచ్చివెలక్కాయలా గొంతు దిగడంలేదు. కాని వాళ్లు చేయగలిగిందేముంది ? తమ్ము బలపరచినందుకు 'చర్చిల్ ప్రధాని'కే చాపుతప్పి కన్నులొట్టపోతే !

ఐతే, ఇంతటితో సామ్రాజ్యవాదులు తమ కుట్రలు పూర్తిగా మానుతారనుకోకూడదు. గ్రీకురాజు జార్జి తనను కొంతకాలం తరువాత సింహాసనం ఎక్కించుతామని బ్రిటను వాగ్దానం చేసిందనీ, అందుచే రీజెన్సీకి అంగీకరించాననీ టెలిగ్రామ్ పంపిన వార్తలు 15 వ తేదీ పత్రికలలో వచ్చాయి. కాబట్టి ప్రజలు ఎప్పటికపుడు సామ్రాజ్యవాదుల ముతావేసే ఎత్తులకు తగినమందువేసి ఎదుర్కోవలసివుంటుంది. అలాచేస్తే ప్రజా విద్రోహులను ఓడించి తీరుతారు.

Printed and Published by Katragadda Rajagopala Rao at Prajasakti Press, Governorpet - Bezwada

END OF ISSUE